పోలీసుల అదుపులో పిల్లి రాజు!

» యానాం వారధిపై ద్విచక్ర వాహనం గుర్తింపు 7



అంతరిక్షం.. అద్భుతం!

7

భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్ భూమిపై అడుగిడిన వేళ అమలాపురం రూరల్‌లోని సమనస లోని శ్రీరామా పబ్లిక్ స్కూలు విద్యార్థులు 'వెల్‌కం సునీత' అనే అక్షరాల రూపంలో కూర్చొని శుభాకాంక్షలు తెలిపిన దృశ్యం.

- అమలాపురం రూరల్



కాట్రేనికోనకు చెందిన ప్రముఖ చిత్రకారుడు అంజి ఆకొండి వాటర్ కలర్స్‌తో గీసిన సునీతా విలియమ్స్ చిత్రం.

- కాట్రేనికోన


అమలాపురంలో సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్



అమలాపురంలో సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైకిల్ ర్యాలీ

తీర ప్రాంతాల్లో జాతీయ భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 11 రాష్ట్రాల మీదుగా సైక్లోథాన్ సైకిల్ ర్యాలీ చేపట్టగా బుధవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్ చేరుకోగా జిల్లా పోలీసులు ఘనస్వాగతం పలికారు

ఆలివ్ రిడ్లే.. గుడ్లు.. గుడ్లే..





- » సముద్ర తీరంలో విదేశాల నుంచి అలీవర్ రిడ్లే తాబేళ్ల ప్రవాహం
- » ఇప్పటివరకు కాకినాడ, కోనసీమ జిల్లాలకు 675 తాబేళ్లు రాక
- » జనవరి 18 నుంచి ఈ రెండు జిల్లాల్లో 74 వేల గుడ్లు పెట్టిన తాబేళ్లు
- » కాకినాడ హోప్‌ఐలాండ్‌లో 27 వేల గుడ్లు పెట్టిన 225 తాబేళ్లు
- » కోనసీమ జిల్లాలో 46 వేల గుడ్లు పొదిగిన 450 అలీవ్‌రిడ్లేలు
- » ఒక్కో తాబేలు 120 చొప్పున గుడ్లు పొదుగుతున్న వైనం
- » సముద్ర తీరాన గొయ్యి తీసి గుడ్లు పొదిగి ఇసుక కప్పేసి తిరిగి సముద్రంలోకి
- » మొదలైన గుడ్ల నుంచి తాబేలు పిల్లల జననం.. రోజుకు 650 పిల్లలు బయటకు
- » నక్కలు, కుక్కల బారి నుంచి రక్షించేందుకు అటవీ శాఖ హెచరీలు
- » గతేడాది ఉమ్మడి జిల్లాలో 1.20 లక్షల గుడ్లు పొదిగిన అలీవ్‌రిడ్లే తాబేళ్లు



గుంతలు తవ్వి గుడ్లు పొదిగిన తాబేళ్లు





గుడ్లను సంరక్షిస్తోన్న అటవీశాఖ సిబ్బంది

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

అంతరించేపోయే జాబితాలో చేరిన అరుదైన అలీవ్‌రిడ్లే తాబేళ్లు మన సముద్ర తీర ప్రాంతానికి ఓ ప్రవాహంలా తరలివస్తున్నాయి. ఎక్కడెక్కడో వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీలంక.. థాయ్‌లాండ్.. ఇండోనేషియా దేశాల నుంచి సముద్రంలో వేల కిలోమీటర్లు ఈదుకుంటూ ఇక్కడకు సంతానోత్పత్తి కోసం బారులు తీరుతున్నాయి.. ఇప్పుడు కాకినాడ జిల్లాలోని హోప్ ఐలాండ్.. కోనసీమ జిల్లాలోని గోదావరి, సముద్రం కలిసే ప్రాంతాల్లో వేలల్లో గుడ్లు పెడుతున్నాయి. సంతానోత్పత్తికోసం అంతదూరం నుంచి వస్తోన్న ఈ తాబేళ్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఇప్పటివరకు పెట్టిన గుడ్లు ఎన్నో తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే.. ఒక్కో తాబేలు సరాసరి 120 గుడ్ల చొప్పున జనవరి మూడో వారం నుంచి ఇప్పటివరకు ఏకంగా 74 వేల గుడ్లు పొదిగాయి. గుడ్లు పొదిగేసి ఆ వెంటనే తిరిగి సముద్రంలోకి వెళ్లిపోగా.. ఇప్పుడు ఆ గుడ్ల నుంచి రిడ్లే పిల్లలు బయటకు రావడం మొదలుపెట్టాయి. ఎక్కడో వేల కిలోమీటర్లు ఈదుకుని ఇక్కడ కొచ్చి గుడ్లు పొదిగి పిల్లలను చూడకుండానే వెళ్లిపోతున్న తాబేళ్లు ఆ గుడ్లను రక్షించేందుకు ఏకంగా గోతులు తవ్వి అందులో గుడ్ల పొదిగి ఎవరికి కనిపించకుండా ఇసుక కప్పేసి వెళ్లిపోగా.. ఇప్పుడు వాటి నుంచి రోజుకు వందలాది పిల్లలు బయటకు వస్తున్నాయి. దీంతో ఇప్పుడు సముద్రతీరంలో ఇవన్నీ సందడి చేస్తూ కనువిందు చేస్తున్నాయి. అటు అటవీ శాఖ అధికారులు ఈ గుడ్ల నుంచి క్షేమంగా పిల్లలు బయటకు వచ్చేలా అనేక రక్షణ చర్యలు తీసుకుంటుండడంతో ఈ ఏడాది ఆలివ్‌రెడ్లే తాబేళ్ల సంతానం భారీస్థాయిలో పెరుగుతోంది.

సందడే సందడి..

సముద్ర పర్యావరణాన్ని రక్షించడంలో ఎంతో కీలకమైన ఆలివ్‌రిడ్లే తాబేళ్లు ప్రపంచవ్యాప్తంగా అంతరించిపోయే జాబితాలో ఉన్నాయి. ఈ తాబేళ్లలో ఏడు రకాల జాతులుండగా, ఐదు జాతులు జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో అధికం. అటు శ్రీలంక, థాయ్‌లాండ్, ఇండోనేషియా దేశాల్లోను అనేక జాతులున్నాయి. ఇప్పుడివి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సముద్ర తీరానికి వందల్లో ప్రయాణించుకుంటూ వస్తున్నాయి. ప్రధానంగా కాకినాడ హోప్‌ఐలాండ్, కోనసీమ జిల్లాలో ఐ.పోలవరం, అల్లవరం, అమలాపురం రూరల్ ప్రాంతాల్లోని సముద్ర తీరానికి తరలివస్తున్నాయి. దీంతో ఇప్పుడు ఎక్కడ చూసినా వీటి సందడే నెలకొంది. వీటి రాక జనవరి నెలాఖరు నుంచి మొదలవగా ప్రస్తుతం ఎక్కువ సంఖ్యకు చేరుకుంది. ఇలా వచ్చిన తాబేళ్లన్నీ కాకినాడ, కోనసీమ జిల్లాల్లో భారీగా గుడ్లు పొదుగుతున్నాయి. ఇప్పటివరకు అటవీశాఖ అధికారుల అంచనా మేరకు కాకినాడ జిల్లాకు 225, కోనసీమ జిల్లాకు 450 తాబేళ్లు వచ్చినట్టు గుర్తించారు. ఇవి ఇప్పటివరకు మొత్తం 74 వేల గుడ్లు పొదిగాయి. ఇది భారీ సంఖ్యగానే భావించాలి. కాకినాడ జిల్లాలో హోప్‌ఐలాండ్‌కు ఇప్పటివరకు 225 తాబేళ్లు రాగా, 28వేల గుడ్లు పొదిగాయి. కోనసీమ జిల్లాలో 450 తాబేళ్లు 46వేల గుడ్లు పొదిగినట్టు గుర్తించారు. దీంతో ఈ రెండు జిల్లాల తీర ప్రాంతాల్లో ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సందడి భారీగా ఉంది. వాస్తవానికి ఈ గుడ్లను తాబేళ్లు సముద్రతీరాన ఇసుకలో 30 నుంచి 45 సెంటీమీటర్ల లోతున కుండాకారంలో గుంతలు తీస్తాయి. వాటిలో గుడ్లను పొదుగుతాయి. ఒక్కో తాబేలు సరాసరి 120 వరకు గుడ్లను పొదుగుతాయి. ఆ వెంటనే గుడ్లపై ఇసుకను కప్పేసి తిరిగి తాబేళ్లు తమ గమ్యస్థానానికి వెళ్లిపోతాయి. ఆ తర్వాత 40 రోజుల ఆ తర్వాత ఆ గుడ్ల నుంచి తాబేళ్లు పొదుగుతాయి. ఈలోపు 30 నుంచి 32 డిగ్రీల ఉష్ణోగ్రత ఎండ వేడిమి ఉంటేనే గుడ్ల నుంచి పిల్లలు బయటకు వస్తాయి. ఇప్పుడు హోప్‌ఐలాండ్‌తోపాటు కోనసీమ జిల్లాలో వాసాలతిప్ప, ఎస్.యానాం, గచ్చకాయల పొర, నీళ్ల రేవు తదితర ప్రాంతాల్లో వేలల్లో ఉన్న గుడ్లను అటవీశాఖ సంరక్షిస్తోంది. తాబేళ్లు పెట్టే గుంతలను ఇన్సిటివ్‌గా పిలిచే అటవీశాఖ వాటి చుట్టూ ప్రస్తుతం నెట్‌లు కట్టి రక్షిస్తోంది. లేదంటే కుక్కలు, నక్కలు ఈ గుడ్లను తినేసే ప్రమాదం ఉంది. వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న గుడ్లను అటవీశాఖ కాకినాడ జిల్లాలో రెండు, కోనసీమ జిల్లాలో ఐదుచోట్ల హేచరీల కింద ఒకేచోటకు తెచ్చి సంరక్షించడంతో దీంతో ఈ దఫా గుడ్ల సంరక్షణ మెరుగైంది.

పిల్లలు బయటకొస్తున్నాయి..

ఆలివ్‌రిడ్లే తాబేళ్లు ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో కాకినాడ, కోనసీమ జిల్లాలకు 675 వరకు రాగా, 90 శాతం తాబేళ్లు గుడ్లు పెట్టి వెళ్లిపోయాయి. ఇప్పుడు 40 రోజుల వ్యవధి దాటడంతో ఆదివారం నుంచి పిల్లలు పొదుగుతున్నాయి. రోజుకు ఉమ్మడి జిల్లాలో 780 వరకు పిల్లలు బయటకొస్తున్నాయి. ఇవి పుట్టిన 12గంటల్లో తిరిగి సముద్రంలోకి వెళ్లిపోతున్నాయి. వాస్తవానికి అరుదైన జాతికి చెందిన ఆలివ్‌రిడ్లే తాబేళ్లలో ఆడా, మగా పుట్టుక పూర్తిగా ఉష్ణోగ్రతపైనే ఆధారపడనున్నాయి. గుడ్లు పొదిగిన తర్వాత 28 నుంచి 32 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటే 40 రోజుల తర్వాత మగ తాబేళ్లు, ఉష్ణోగ్రత 30 నుంచి 32 మధ్య ఉంటే ఆడ తాబేళ్లు బయటకు వస్తాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో ఆడతాబేళ్ల పిల్లలు అధికంగా బయటకు వస్తున్నాయి. కాకినాడతో పోల్చితే కోనసీమ జిల్లాలో పిల్లలు అధికంగా ఉత్పత్తి అవుతున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. మరోపక్క ఈనెలాఖరు వరకు రానున్న తాబేళ్లు మరికొన్ని గుడ్లను పొదగనున్నాయి. ఈనెల దాటితే విదేశాల నుంచి ఆలివ్ రిడ్లే తాబేళ్ల రాక పూర్తిగా ఆగిపోనుంది.

ఇక్కడకే ఎందుకంటే..

అలివ్ రిడ్లే తాబేళ్లకు ఓ ప్రత్యేకత ఉంది. అవి ఎక్కడైతే గుడ్ల నుంచి పిల్లలుగా బయటకు వచ్చాయో అదే ప్రాంతానికి పెద్దయ్యాక తిరిగి సంతానోత్పత్తికి వస్తాయి. ఇందులోభాగంగా కాకినాడ జిల్లాలో హోప్ ఐలాండ్, కోనసీమ జిల్లాలో కొన్ని తీరప్రాంత మండలాలకు తరలివస్తున్నాయి. గతంలో ఉప్పాడ తీరానికి సైతం భారీగా వచ్చేవి. అక్కడ సముద్రతీరం కలుషితం కావడంతో ఇక్కడకు రావడం లేదు. వాస్తవానికి ఏటా వేలల్లో వచ్చే ఆలివ్‌రిడ్లే తాబేళ్లు కొన్నేళ్లుగా భారీగా తగ్గిపోయాయి. సముద్ర కాలుష్యం, వేట పడవులకు తగిలి, వలలో చిక్కుకుని భారీగా చనిపోతున్నాయి. దీంతో రెండేళ్లుగా సముద్రతీరంలో ఎక్కడ చూసినా వీటి కళేబరాలే కనిపిస్తున్నాయి. దీంతో అరుదైన జాతికి చెందిన వీటిని సంరక్షించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జిల్లా అటవీశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో తాబేళ్ల గుడ్లను ఇటీవల ఎక్కువగా సంరక్షిస్తున్నారు. సముద్రంలో ఆక్సిజన్ శాతం పెంచేందుకు, చేపల సంతానం వృద్ధి చెందేందుకు అలివ్ రిడ్లే తాబేళ్లు ఎంతగానో దోహదం చేస్తాయి. చేప పిల్లలను తిని జీవించే జెల్లీఫిష్‌లను తాబేళ్లు తినడంవల్ల చేపల ఉత్పత్తి పెరుగుతుంది. కాగా గతేడాది ఉమ్మడి జిల్లాలో ఆలివ్‌రిడ్లే తాబేళ్లు లక్షకుపైగానే గుడ్లు పొదిగాయి. కాకినాడ జిల్లాకు గతేడాది 420 తాబేళ్లు రాగా 32 వేల వరకు గుడ్లు పొదిగాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గతేడాది 850 వరకు తాబేళ్లు రాగా 91 వేల గుడ్లు పొదిగాయి.

డ్రెడ్జింగ్ ప్రాంతంలో కలెక్టర్ పరిశీలన



డ్రెయిన్ గట్ల పటిష్టతపై ఆరా తీస్తున్న కలెక్టర్

ఉప్పలగుప్తం, మార్చి19(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం మండలం కూనవరం మేజర్ డ్రెయిన్‌లో డ్రెడ్జింగ్‌వల్ల నాలుగు మండలాల రైతులకు లబ్ధి చేకూరుతుందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు.కూనవరం మేజర్‌డ్రెయిన్‌లో రూ.3.50 కోట్లతో ప్రారంభించిన పూడికతీత పనులను ఆయన బుధవారం క్షేత్రస్థాయి పర్యటన ద్వారా పరిశీలించారు. రాఘవులపేట వంతెన దిగువ నుంచి డ్రెయిన్స్ ఈఈ కె.కిశోర్‌కుమార్‌తో కలిసి డ్రెయిన్‌లో బోటులో ప్రయాణించి డ్రెయిన్ కుడి,ఎడమ గట్ల పరిస్థితిని గమనించారు. డ్రెడ్జింగ్ పనుల తీరు, గట్ల పటిష్టత తదితర అంశాలపై ఈఈతో చర్చించారు. అనంతరం డ్రెయిన్ ఎడమ గట్టును పరిశీలించిన కలెక్టర్ మట్టిపై ఆరా తీశారు. పర్రవైపు, డ్రెయిన్‌లోని పూడిక మట్టితో గట్టును పటిష్టం చేసినట్టు ఈఈ చెప్పారు. ఎడమ గట్టు కోతకు గురికాకుండా నూతన సాంకేతిక పద్ధతిలో పటిష్టం చేసే ఆలోచన చేస్తామని కలెక్టర్ అన్నారు. రాఘవులపేట వంతెన నుంచి కాట్రేనికోన మండలం చిర్రయానాంవరకు ఈగట్టును పక్కా రహదారిగా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ వాసా శామ్యూల్‌దివాకర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు, అగ్నికులక్షత్రియ సంఘం నాయకులు పాల్గొన్నారు. సమస్య తమదే అయినా కలెక్టర్ పర్యటన సమాచారం తమకు అందలేదని నీటిసంఘాల చైర్మన్లు ఆగ్రహం వ్యక్తంచేశారు.

రూ.3.50కోట్లతో 2.6 కి.మీ డ్రెడ్జింగ్

కూనవరం మేజర్‌డ్రెయిన్‌లో రూ.3.50 కోట్లతో 2.6 కి.మీ మేర డ్రెడ్జింగ్ చేస్తామని డ్రెయిన్స్ కార్యనిర్వాహక ఇంజనీరు కె.కిశోర్‌కుమార్ తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డ్రెయిన్‌లో రాఘవులపేట వంతెనకు దిగువ నుంచి సముద్రం మొగకు 600మీటర్ల దిగువ వరకు డ్రెడ్జింగ్ నిర్వహిస్తామన్నారు. డ్రెడ్జింగ్ పూర్తయిన తర్వాత ఎగువ నుంచి డ్రెయిన్‌లో ప్రవాహ వేగం పెరుగుతుందన్నారు. అనంతరం మొగ వరకు డ్రెడ్జింగ్ చేపడితే మొగ మూసుకుపోకుండా ఉంటుందన్నారు.

పది పరీక్షలకు 98మంది గైర్హాజరు

ముమ్మిడివరం,మార్చి 19(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు బుధవారం జిల్లాలోని 23మండలాల్లో 110 పరీక్షా కేంద్రాల్లో జరగ్గా 18,959మందికిగాను 18,861మంది హాజరయ్యారు. 98మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు డీఈవో షేక్ సలీంబాషా తెలిపారు. హిందీ పరీక్షలకు సంబంధించి 99.48 శాతం విద్యార్థులు హాజరయ్యారన్నారు. వీరిలో బాలురు 9,416మందికి 9359మంది హాజరుకాగా 57మంది గైర్హాజరయ్యారు. బాలికలు 9,543మందికి 9502 మంది హాజరుకాగా 41మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను జిల్లా పరీక్షల పరిశీలనాధికారి మువ్వా రామలింగం నాలుగు పరీక్షా కేంద్రాలను, ఆర్జేడీ జి.నాగమణి మూడు పరీక్షా కేంద్రాలను, డీఈవో షేక్ సలీంబాషా నాలుగు పరీక్షా కేంద్రాలను, డీవైఈవో జి.సూర్యప్రకాష్ ఐదు పరీక్షా కేంద్రాలను, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతరావు ఆరు పరీక్షా కేంద్రాలను, ఫ్లయింగ్‌స్క్వాడ్ 9పరీక్షాకేంద్రాలను, ఎంఈవోలు 23 కేంద్రాలను తనిఖీ చేశారు.

ఇంటర్ జాగ్రఫీ పరీక్షకు.. ఒక విద్యార్థి గైర్హాజరు

అమలాపురం టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జాగ్రఫీ పరీక్ష నిర్వహించినట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. 16మంది విద్యార్థులకుగాను 15 మంది హాజరుకాగా ఒకవిద్యార్థి గైర్హాజరయ్యారు. గురువారం ద్వితీయసంవత్సరం విద్యార్థులకు పరీక్ష జరుగుతుందన్నారు.

నదీగర్భానికి తూట్లు

- » గౌతమీ గోదావరిలో ఎక్స్‌కవేటర్లతో ఇసుక తవ్వకాలు.. యథేచ్ఛగా తరలింపు
- » ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధిలోని గురజాపులంకలో అనధికారికంగా ర్యాంపు
- » చోద్యం చూస్తున్న అధికారులు



గురజాపులంకలో ఎక్స్‌కవేటర్‌తో నదీ గర్భంలో ఇసుక తీస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ గర్భంలో ఇసుకను అక్రమంగా తవ్వి తరలించుకుపోతున్నారు. నదీగర్భంలో ఎటువంటి తవ్వకాలు జరపరాదనే నిబంధనలు ఉన్నా వాటిని తుంగలోకి తొక్కి ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను తవ్వి ట్రాక్టర్లతో తరలించుకుపోతున్నారు. ఫ్లడ్ కన్సర్వెన్సీ చట్టం 6, 9, 13ల ప్రకారం నదీ గర్భంలో మిషన్లతో ఎటువంటి మట్టి, ఇసుక తవ్వరాదు. ఆ నిబంధనలు తుంగలోకి తొక్కి నదీ గర్భంలో ఏ అనుమతులు లేకుండా ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను తవ్వి ట్రాక్టర్లతో తరలించుకుపోతున్నారు. ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధిలోని గురజాపులంకలో గౌతమీ గోదావరి నదీ గర్భంలో పదిరోజులుగా అక్రమంగా తవ్వేస్తున్నారు. ఈ అనాథరైజ్డ్ ఇసుక ర్యాంపువద్ద ట్రాక్టరుకు రూ.1200 వంతున వసూలు చేస్తున్నారు. ఆ ట్రాక్టర్లు వారు బయట రూ.2200కు ఇసుకను విక్రయిస్తున్నారు. ర్యాంపు వద్ద వసూలు చేసే రూ.1200లో ట్రాక్టరు లోడింగ్, ఇతర ఖర్చులకు కొంత కేటాయించి అక్కడినుంచి ఇసగురజాపులంక, కూనాలంక, లంకాఫ్ ఠాణేలంక గ్రామాల రోడ్ల మీదుగా ఇసుకను తరలించడంతో ఆయా గ్రామాల్లో ఉన్న దేవాలయాలు, ఇతర వాటికి ఇంతని కేటాయించి మిగతాసొమ్ములను నాయకులు మింగేస్తున్నారు. రోజుకు 40 నుంచి 60 వరకు ట్రాక్టర్లు అక్కడినుంచి ఇసుకను తరలిస్తున్నాయి. రోజుకు 180 నుంచి 200 వరకు ట్రాక్టర్ల ఇసుక అక్కడినుంచి తరలివెళ్లిపోతోంది. అంటే రోజుకు రూ.2లక్షల మేర ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ఇసుక అక్రమ తవ్వకాల వల్ల గోదావరి సహజత్వానికి ముప్పు వాటిల్లి లంక భూములు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని లంక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లంక భూములు నదీ కోతకు గురవడంతో వాటి పరిరక్షణకు ముమ్మిడివరం నియోజకవర్గానికి సంబంధించి 4కిలోమీటర్ల మేర రివిట్‌మెంట్, పిచ్చింగ్ వంటి పనులకు రూ.230కోట్లతో ప్రతిపాదనలు కూడా పంపించారు. వరదలకు విలువైన లంక భూములు నదీ కోతకు గురవుతుంటే గోదావరి నదీ గర్భంలో అక్రమ తవ్వకాలవల్ల భూములకు మరింత ముప్పు పొంచి ఉంది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీసు, మైన్స్, హెడ్‌వర్క్స్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడంలేదు. ఇసుక అక్రమ తవ్వకాలదారుల నుంచి ముడుపులు అందడంలో వారు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

కాట్రేనికోన ఎంపీపీ, మూడు వైస్ ఎంపీపీ, 18 ఉపసర్పంచ్ స్థానాల ఎన్నికకు నోటిఫికేషన్

అమలాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒక ఎంపీపీతోపాటు మూడు వైస్ ఎంపీపీ స్థానాలకు పంచాయతీల్లో ఉపసర్పంచ్ పదవులకు ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ షెడ్యూల్ విడుదల చేశారు. కాట్రేనికోన ఎంపీపీ, పి.గన్నవరంలో ఒక వైస్ ఎంపీపీకి సఖినేటిపల్లిలో రెండు వైస్ ఎంపీపీ స్థానాలకు, 18గ్రామ పంచాయతీల ఉపసర్పంచ్ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈనెల 27 నాటికి ఎన్నిక జరిపి 28నాటికి నివేదిక అందించాలన్నారు. జిల్లాలో ఖాళీ అయిన ఆత్రేయపురం మండలం పులిదిండి, రాయవరం మండలం వెదురుపాక, రాయవరం, ఐ.పోలవరం మండలం జి.మూలపొలం, ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి, రాజోలు మండలం సోంపల్లి, శివకోటి, ఆలమూరు మండలం మోదుకుర్రు, కొత్తపేట పంచాయతీ, పలివెల, మలికిపురం మండలం లక్కవరం, చింతలమోరి, సఖినేటిపల్లిమండలం మోరిపోడు, అంతర్వేదిపాలెం, అంబాజీపేట మండలం మాచవరం, అల్లవరం మండలం యెంట్రుకోన, అయినవిల్లి మండలం పోతుకుర్రు, రామచంద్రపురం మండలం నీలపర్తిపాడు పంచాయతీ ఉప సర్పంచ్ స్థానాలకు ఎన్నికల జరపనున్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము పరిశీలన



గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ముమ్మిడివరం, మార్చి19(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచిన గోదాములకు పటిష్ఠ భద్రతను కల్పిస్తూ పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు భద్రపరిచిన గోదామును ఆయన పరిశీలించారు. గోదాముకు సీలు వేసిన తాళాలను పరిశీలించి తాళాలను తెరిపించి గోదాములో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్లను రాజకీయ పార్టీల నాయకులు, అధికారులతో కలిపి పరిశీలించారు. మూడునెలల తనిఖీలో భాగంగా ఈవీఎంలు, వీవీ ప్యాట్లు గోదాములో సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపకదళ పరికాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎంలు, వీవీప్యాట్ల గోదాములను తనిఖీ చేసి మూడు నెలలకు ఒకసారి సమగ్ర నివేదికను అందిస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో తనిఖీ నిర్వహించి నివేదికను సమర్పించినట్టు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి బీఎల్ఎన్ రాజకుమారి, కాంగ్రెస్ తరపున వడ్డి నాగేశ్వరరావు, టీడీపీ తరపున దొమ్మేటి రమణకుమార్,సీపీఐ తరపున వి.విజయ్‌కుమార్, తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ శివరాజు, ఆర్ఐ రామ్మోహన్, జూనియర్‌అసిస్టెంట్ సాయిరామ్, ఐటీ సపోర్టర్ బాబ్జి, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగర పీహెచ్‌సీకి జిల్లాస్థాయిలో ప్రథమస్థానం

కపిలేశ్వరపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురమండలంలోని అంగర పీహెచ్‌సీకి ఆరోగ్య సేవలందించడంతో జిల్లాస్థాయిలో ప్రథమస్థానం లభించింది. జిల్లాకు సంబంధించి వైద్యఆరోగ్యశాఖపరంగా 46 పీహెచ్‌సీలు, 7 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా వీటి ద్వారా ప్రజలకు ప్రతిరోజూ అనేక వైద్యసేవలు అందజేస్తున్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించినందుకు ఫిబ్రవరి నెలకుగాను జిల్లాస్థాయిలో అంగర పీహెచ్‌సీకి ప్రథమస్థానం దక్కిందని వైద్యాధికారిణి రత్నకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ప్రథమస్థానం లభించడంపట్ల ఆనందంగా ఉందని, క్షేత్రస్థాయి హెడ్‌క్వార్టర్‌సిబ్బంది సమష్టికృషి, అధికారులు, ప్రజల సహాయ సహకారాలతో ఇది సాధ్యమైందని తెలిపారు.

ద్వారపూడిలో కావిళ్ల ఉత్సవం

» 500 మంది మహిళలతో కలశాల ఊరేగింపు 7

అంతరిక్షం.. అద్భుతం!



అంతరిక్షం గురించి తెలుసుకోవాలని ఎంతో మందికి ఆసక్తి ఉంటుంది. అంతుచిక్కని, అద్భుతమైన విషయాలపై దృష్టిపెట్టి బుర్రకు పదును పెట్టాలని అనుకుంటూ ఉంటారు. అయితే భారతదేశ సంతతికి చెందిన సునీతా విలియమ్స్ అంతరిక్షానికి వెళ్లి తిరిగి వస్తున్నారని తెలిసి ఎంతోమంది సంబరపడ్డారు. బుధవారం తెల్లవారుజామున ఆమె భూమిమీదకి వచ్చే క్షణాలను ఆస్వాదించడానికి ఉదయానే నిద్రలేచి టీవీలకు అతుక్కుపోయారు. ఆమె విజయమే తమ విజయంగా మురిసిపోయారు.

భూమి మీదకు సునీతా విలియమ్స్ రాకతో ప్రజల్లో ఆనందం

సర్వత్రా ప్రశంసలు

2028లో ఇస్రో ఆధ్వర్యంలో..
భారతీయ అంతరిక్ష కేంద్రం నిర్మాణం

యాళ్ల శివప్రసాద్, ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త



శివప్రసాద్

అమలాపురం రూరల్ మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అంతరిక్షంలో ఎన్నో ప్రత్యేకతలున్నాయి. భూమికి వంద కిలో మీటర్ల పైవరకు వాతావరణం ఉంటుంది. ఇక ఆ పైన అంతా అంతరిక్షమే. అక్కడ ఆక్సిజన్ అనేది ఉండదని ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మానవాళి జీవించేందుకు ఉపయోగపడేలా అనువైన ప్రాంతాలను గుర్తించడానికి అంతరిక్ష పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ప్రధానంగా మైక్రో గ్రావిటీ మీద అంతరిక్షంలో ప్రయోగాలు చేస్తున్నారు. అంతరిక్ష పరిశోధనలపై ఎంతో ఆసక్తి ఉన్నా సునీతా విలియమ్స్ 8 రోజులు ప్రయోగాలు చేయడానికి వెళ్లి అనుకోని పరిస్థితుల్లో 9నెలల తర్వాత క్షేమంగా భూమికి తిరిగి రావడం విశేషం. ముందుగా వెళ్లిన ఐదుగురు వ్యోమగాములతోపాటు సునీతా విలియమ్స్ మరో వ్యక్తి అక్కడే ఉన్నారు. వారికి అవసరమైన ఆహార పదార్థాలను కార్గో స్పేస్ ద్వారా పంపిస్తారు. అంతరిక్షంలో ఉన్నవారికి స్పేస్ మెడిసన్స్ పేరిట ప్రత్యేకంగా మందులు ఉంటాయి. వారు అక్కడే ఉంటూ అంతరిక్షంతోపాటు ఇతర గ్రహాల మీద మనుషులు జీవించేందుకు వీలున్న ప్రాంతాలను గుర్తించడంతోపాటు అక్కడ లభించే ప్రకృతి సంపదలను గుర్తించేందుకు నిరంతరం ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు. అమెరికా, రష్యా, జపాన్, యూరోపియన్ దేశాలతో కలిసి అంతర్జాతీయ అంతరిక్ష సంస్థను అంతరిక్షంలో కట్టారన్నారు. అక్కడ నిర్మించిన స్పేస్ సెంటర్ అమెరికాలోని ఫుట్‌బాల్ క్రీడా ప్రాంగణమంత ఉంటుందని వివరించారు. భూమికి 400 కిలోమీటర్ల దూరంలో ఆ దేశాలు ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌ను నిర్మించాయన్నారు. స్పేస్ స్టేషన్ నిరంతరం భూమి చుట్టూ తిరుగుతూ ఉంటుంది. గంటకు 28వేల కిలోమీటర్ల వేగంతో భూమి చుట్టూ తిరుగుతుందని వివరించారు. ఒకసారి భూమి చుట్టూ స్పేస్ స్టేషన్ తిరిగి రావడానికి 90 నుంచి 92 నిమిషాల సమయం పడుతుందన్నారు అంత వేగంగా తిరిగితేనే స్పేస్ స్టేషన్ అంతరిక్షంలో ఉండగలుతుందని లేకపోతే పడిపోతుందన్నారు. అంతరిక్ష సంస్థ తరహాలోనే భారతదేశం ఇస్రో ఆధ్వర్యంలో స్పేస్ స్టేషన్ నిర్మాణానికి ఇప్పటికే సన్నాహాలు చేపట్టిందన్నారు. 2028 నాటికి స్పేస్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేసే అవకాశం ఉందని తెలిపారు. స్పేస్ స్టేషన్ నిర్మాణంలో భాగంగా డాకింగ్ టెక్నాలజీని అభివృద్ధి చేసుకున్న దేశాల్లో నాల్గో స్థానాన్ని భారతదేశం దక్కించుకుందన్నారు. డాకింగ్ టెక్నాలజీలో భాగంగా పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్‌లో రెండు ఉపగ్రహాలను ఉంచి గతేడాది డిసెంబరు 30న అంతరిక్షంలో వదిలారన్నారు. ఉపగ్రహాల మధ్య దూరం 20 కిలోమీటర్లు ఉంటుందని, అవి ఒకదానికొకటి దగ్గరకు వచ్చి అనుసంధానం చేయడమే డాకింగ్ టెక్నాలజీ విశిష్టత అన్నారు. డాకింగ్ టెక్నాలజీ ఉంటేనే స్పేస్ స్టేషన్ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. భారతీయ వ్యోమోగాములు త్వరలోనే అంతరిక్ష ప్రయోగాలకు ఇస్రో ఆధ్వర్యంలో బయలుదేరడం ఖాయమని శివప్రసాద్ స్పష్టం చేశారు.



సునీతా విలియమ్స్

సునీతా విలియమ్స్ అందరికీ స్ఫూర్తి : మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భారత సంతతి వ్యోమోగామి సునీతా విలియమ్స్ సురక్షితంగా భూమిపై రావడం సంతోషకరమని, ఆమె నేటి యువతకు స్ఫూర్తి అని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సునీతా విలియమ్స్ 59 ఏళ్ల వయస్సులో అంతరిక్ష పరిశోధనకు వెళ్లి సాంకేతిక లోపం కారణంగా 9 నెలలు అక్కడే ఉండాల్సిరావడంతో ఏమాత్రం మానసిక స్థైర్యం కోల్పోకుండా తిరిగి భూమికి క్షేమంగా చేరుకోవడం సామాన్య విషయం కాదన్నారు. సునీతా విలియమ్స్‌తో పాటు బుచ్‌విల్మోర్‌ను భూమిమీదకు తీసుకురావడానికి కృషి చేసిన అందరూ అభినందనీయులన్నారు.

మహిళలకు ఆదర్శం సునీతా విలియమ్స్



దివాన్‌చెరువు(ఆంధ్రజ్యోతి): రోదసి నుంచి భూమికి తిరిగి వచ్చిన సునీతా విలియమ్స్ నేటి మహిళలకు ఆదర్శం. ప్రతికూల పరిస్థితులను ఏవిధంగా జయించాలో తెలిపిన నింగి నుంచి నేలమీదకు వచ్చిన నిలువెత్తు రూపం. అంతరిక్ష యాత్రికురాలు సునీత, వ్యోమోగామి బుచ్‌విల్మోర్ సహా నలుగురు 9నెలలపాటు అంతరిక్షంలో గడిపి భూమికి చేరుకోవడం హర్షణీయం. అంతరిక్ష పరిశోధనలో మరో చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుంది. ఎన్నిప్రతికూల పరిస్థితులు ఎదురైనా అధిగమించే స్ఫూర్తిని సునీతా విలియమ్స్ జీవితం నుంచి నేర్చుకోవాలి.

ఆచార్య ప్రసన్నశ్రీ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి

సునీతా విలియమ్స్ రోల్‌మోడల్



రాజమహేంద్రవరం అర్బన్(ఆంధ్రజ్యోతి): అంతరిక్షంలో జీరో గ్రావిటీ వాతావరణంలో జరిపే ప్రయోగాలకు వ్యోమగామి సునీతా విలియమ్స్ ప్రపంచ దేశాల అంతరిక్ష శాస్త్రవేత్తలకు రోల్‌మోడల్ కానున్నారు. ఆమె రాబోయే తరాలకు మార్గదర్శకం. 322 రోజుల 17 గంటలకు పైగా అంతరిక్షంలో గడిపి చరిత్ర సృష్టించడంతోపాటు రికార్డు బ్రేకింగ్ స్పేస్‌వాకింగ్ చేశారు. అంతరిక్షంలో దాదాపు 50 గంటల 40 నిమిషాలు స్పేస్‌వాక్ చేయడం ద్వారా అరుదైన ఘనత సొంతం చేసుకున్నారు. ఆమె ఎన్నో అంశాలను స్టడీ చేశారని భావిస్తున్నా, ఇవన్నీ భావి అంతరిక్ష పరిశోధకులకు ఎంతో ఉపయోగపడతాయి.

రామచంద్ర ఆర్‌కే, భౌతికశాస్త్ర పరిశోధకుడు, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, రాజమహేంద్రవరం

సునీతా విలియమ్స్ రాక ఎంతో ఆనందం



కోటనందూరు (ఆంధ్రజ్యోతి): సునీతా విలియమ్స్ భూమి మీదకి విజయవంతంగా తిరిగి రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఆమె 286 రోజులు అంతరిక్షంలో గడిపి అనేక పరిశోధనలు చేసి స్పేస్‌ఎక్స్ డ్రాగన్ క్యాప్సూల్స్ ద్వారా క్షేమంగా భూమికి చేరుకోవడం గొప్ప విషయమే. ఇది శాస్త్రసాంకేతిక రంగాల్లో మనిషి చేసిన ప్రగతికి అద్భుతమైన నిదర్శనం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిచ్చేలా ఉంది. సునీతా విలియమ్స్ వంటి శాస్త్రవేత్తలు మనదేశానికి ఉండడం గర్వకారణం. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించేందుకు ఇలాంటి వ్యక్తులు మనకు ఆదర్శంగా ఉండాలి. భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడుతుంది.

-ఎం.రామ్‌శేఖర్, ఎంఈవో2, ఫిజిక్స్ టీచర్, కోటనందూరు

తమిళనాడు తరహాలో..

ద్వారపూడిలో కావిళ్ల ఉత్సవం

కలశాలతో 500 మంది మహిళల ఊరేగింపు



నెత్తిపై కలశంతో యువతి, స్వామివారిని ప్రత్యేక వాహనంలో ఊరేగిస్తున్న స్వాములు

మండపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో బుధవారం కుమారస్వామివారి కావిళ్ల, కలశ ఉత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. తమిళనాడు తరహాలో ఇక్కడ ప్రతి ఏటా ఉత్సవం నిర్వహించటం ఆనవాయితీ. దాదాపు 40 రోజులపాటు కుమారస్వామి మాలధారణ దీక్షను ఇక్కడి ప్రజలు చేపడతారు. గ్రామంలో ఉన్న స్వామివారి ఆలయం వద్ద దీక్ష తీసుకున్న స్వాములు కఠోర దీక్షతో పూజలు చేస్తుంటారు. 500 మంది మహిళలు కలశాలతో బయలుదేరుతారు. ఈ క్రమంలో బుధవారం జరిగిన కార్యక్రమానికి ద్వారపూడి పరిసర గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. అనంతరం గ్రామంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో విశేషపూజలు, జలాభిషేకాలు నిర్వహించారు. స్వామిని టీడీపీ మండలాధ్యక్షుడు యరగతపు బాబ్జీ, బీజేపీ నేత కోనా సత్యనారాయణ, ప్రముఖులు దర్శించుకున్నారు.



మండపేట మండలం ద్వారపూడిలో కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ముగిసిన ఆదిత్య ప్రో కార్టింగ్ ఎండ్యురెన్స్ పోటీలు



హోరాహోరీగా జరుగుతున్న పోటీలు

గండేపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఆదిత్య ప్రో కార్టింగ్ ఎండ్యురెన్స్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారంతో ముగిశాయి. సీజన్-5లో భాగంగా ఈ పోటీలను నిర్వహించారు. వర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి హాజరయ్యారు. ఏపీ, తమిళనాడు రాష్ట్రాల నుంచి మొత్తం 13 టీమ్‌లు పాల్గొన్నాయి. ఇందులో విజేతగా రఘు ఇంజనీరింగ్ కాలేజీ (విశాఖపట్నం), రన్నరప్‌గా ఎస్ఆర్‌కేఆర్‌కాలేజీ (భీమవరం) జట్లు గెలుపొందాయి. ముఖ్య అతిథిగా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ హెడ్ ఆఫ్ అడ్వాన్స్ ఇంజనీరింగ్ గ్రూప్ డాక్టర్ గంగారెడ్డి హాజరై జెండా ఊపి ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్ విజేతలను డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్ విన్నర్‌కి రూ.75వేలు, రన్నర్‌కి రూ.50 వేలు, ఎండ్యురెన్స్ విన్నర్‌కి రూ.50వేలు, రన్నర్‌కి రూ.25వేలు నగదు బహుమతిని అందించారు. వైస్‌చాన్సలర్ డాక్టర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జీ.సురేష్, ఎస్.భీమేశ్వరరెడ్డి, కే.నాగసురేష్, అడ్డూరి సీతారామ్మూర్తి పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువతికి వైద్యం

మానవత్వం చూపిన న్యాయమూర్తి



వివరాలు వెల్లడిస్తున్న జడ్జి కమలాదేవి

కాకినాడ క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేకుండా ఒంటిపై సగం దుస్తులు మాత్రమే కప్పుకుని తిరుగుతున్న ఓ యువతి గురించి తెలుసుకున్న ఓ జడ్జి మానవీయ కోణంలో స్పందించారు. ఆమె ఆదేశానుసారం ఆ యువతికి కాకినాడ జీజీహెచ్‌లో వైద్యం అందిస్తున్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్, మూడవ అదనపు జిల్లా కోర్టు జడ్జి పి.కమలాదేవి బుధవారం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 2రోజుల క్రితం తాను బయటకు వస్తుండగా మతిస్థిమితం లేకుండా ఒంటిపై సగం దుస్తులు మాత్రమే కప్పుకుని అక్కడక్కడా తిరుగుతున్న యువతిని చూశానని, ఆమె ఆచూకీ గమనించాలని తమ సిబ్బందితో పాటు పోలీసులకు తెలియజేశారన్నారు. బాధితురాలు సుమారు 10రోజులుగా నగరంలో ఈ విధంగా తిరుగుతోందని పోలీసులు తెలియజేయడంతో ఆశ్చర్యానికి గురయ్యానన్నారు. ఆమెకు మానసిక వైద్యం అందించాలని వైద్యులకు దిశ వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది తెలియజేయడంతో తాను ప్రత్యేకంగా రిసెప్షన్ ఆర్డర్ ఇచ్చానన్నారు. దీంతో బాధితురాలికి జీజీహెచ్‌లో వైద్యులు వైద్యం అందిస్తున్నారన్నారు. నగరానికి చెందిన ఆ యువతి వైద్య విద్యను అభ్యసించినట్టుగా విచారణలో తేలిందన్నారు. పూర్తి వివరాలు సేకరించిన అనంతరం ఆమెను ఇంటికి పంపిస్తామన్నారు. ఈ విధంగా మతిస్థిమితం లేక దుస్తులు లేకుండా తిరిగే యువతులు ఎంతో మంది ఉన్నారన్నారు. వారి పట్ల ఎంతో దయగా వ్యవహరించాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలను ఉపయోగించుకుని అండగా నిలవాలని జడ్జి కమలాదేవి హితవు పలికారు.

భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు

రాజమహేంద్రవరం/ధవళేశ్వరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. ధవళేశ్వరం సీఐ టి.గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన దాడి గణేశ్ 2019లో తన భార్యకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో ఆమెను చెక్క పీటతో కొట్టి, చాకుతో పొడిచి చంపేశాడు. దీనిపై మృతురాలి అన్నయ్య ఫిర్యాదుతో అప్పటి ఎస్ఐ వెంకయ్య, సీఐ బాలశౌరి కేసు దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో గణేశ్‌కు జీవిత ఖైదు శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ ఐదో అదనపు జిల్లా జడ్జి డి.విజయ్ గౌతం తీర్పు చెప్పారు.

భార్యపెట్టిన కేసులతో మనస్తాపం చెంది

భర్త ఆత్మహత్య

ఉండ్రాజవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భార్య భర్తపై పెట్టిన కేసులతో భర్త మనస్తాపం చెంది పురుగుమందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోని పాలంగి గ్రామంలో జరిగింది. ఉండ్రాజవరం ఎస్ఐ జి. శ్రీనివాసరావు బుధవారం తెలిపిన వివరాలు ప్రకారం.. పాలంగికి చెందిన ఉండ్రాజవరపు కిరణ్‌కుమార్ (47) విజయవాడకు చెందిన మంజుతో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. కొనేళ్ల తర్వాత ఉద్యోగం నిమిత్తం కిరణ్‌కుమార్ సింగపూర్ వెళ్లాడు. ఇండియాకు వచ్చినపుడు భార్యభర్తల మధ్య జరిగిన గొడవలు నేపథ్యంలో భార్య మంజు భర్త కిరణ్‌కుమార్‌పై 3 కేసులు పెట్టడంతో ఏడాదిక్రితం ఉద్యోగం మానేసి కోర్టులు చుట్టు తిరుగుతున్నారు. భార్య పెట్టిన కేసులకు మనస్తాపం చెంది మంగళవారం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం మృతుడి తండ్రి ఉండ్రాజవరపు సౌలురాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కె.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

భారీ దోపిడీకి స్కెచ్.. పోలీసుల చెక్!



విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న పిస్టల్స్, బుల్లెట్లు

- కాకినాడ జిల్లాలో తప్పిన భారీ దోపిడీ
- పోలీసుల చాకచక్యంతో నిందితుడి పట్టివేత
- 2 పిస్టల్స్, 17 బుల్లెట్లు స్వాధీనం
- నిందితుడు అంతర్‌జిల్లా పాత నేరస్తుడు
- కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

సర్పవరం జంక్షన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అతడో బ్యాంకు ఉద్యోగి. ఆన్‌లైన్ బెట్టింగ్, ఇతర చెడు వ్యసనాల కారణంగా పని చేసే బ్యాంకులో బంగారు ఆభరణాలు చోరీ చేసి నిందితుడిగా మారాడు. అప్పులు తీర్చేందుకు వేరేదారి లేక కష్టపడకుండా సులువుగా డబ్బులు సంపాదించేందుకు చోరీల బాటను ఎంచుకున్నాడు. చిన్న చిన్న చోరీలు చేస్తే ప్రయోజనం లేదని ఏదైనా బ్యాంకు, ఏటీఎంలో చోరీకి పాల్పడి పెద్ద మొత్తంలో దోపిడీ చేస్తే జీవితంలో సెటిల్ అయిపోవచ్చనే దురుద్దేశంతో బీహార్ నుంచి 2 పిస్టల్స్ కొనుగోలు చేశాడు. చోరీకి రెక్కీలు నిర్వహిస్తోండగా మంగళవారం రాత్రి కాజులూరులో రెక్కీ నిర్వహిస్తోండగా కాకినాడ జిల్లా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి చాకచక్యంగా నిందితుడ్ని పట్టుకున్నారు. 2 పిస్టల్స్, 17 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి అరెస్ట్ వివరాలను బుధవారం సర్పవరం జంక్షన్‌లో గల కాకినాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

విశాఖపట్టణం మద్దిలపాలెం ఫిష్‌మార్కెట్ సమీపంలో గ్రూప్‌హౌస్‌లో చిటికెల నాగేశ్వరరావు, భార్య కుటుంబ సభ్యులతో కలసి నివాసం ఉంటున్నాడు. అతడు గతంలో పశ్చిమ గోదావరి జిల్లా నిడమర్రు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో ప్రొబిషనరీ ఆఫీసర్‌గా పనిచేసేవాడు. ఈక్రమంలో ఆన్‌లైన్ బెట్టింగ్, చెడు వ్యవసనాల కారణంగా బ్యాంకు నుంచి 900 గ్రాముల బంగారాన్ని బ్యాంకు నుంచి తనకున్న అధికారాన్ని దుర్వినియోగం చేసి సొంత అవసరాలకు వాడుకోవడంతో సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా సుమారు రూ.40 లక్షలు బ్యాంకుకి కట్టేశాడు. అప్పులు తీర్చలేక, చెడు వ్యసనాలకు డబ్బుల్లేక చోరీల బాట పట్టాడు. చిన్న చోరీలతో జీవితంలో స్థిరపడటం సాధ్యం కాదని గ్రహించిన నాగేశ్వరరావు భారీ దోపిడీకి స్కెచ్ వేశాడు. బీహార్ ముంగర్ ప్రాంతానికి వెళ్లి 2పిస్టల్స్, 17 బుల్లెట్లు కొనుగోలు చేశాడు. దాంతో బ్యాంకు, ఏటీఎంల దోపిడి చేసేందుకు విశాఖ సిటీ, రూరల్, నర్సీపట్నం, ఆంధ్ర, తమిళనాడు బోర్డర్‌లలో రెక్కీ నిర్వహించాడు. ఈ క్రమంలో నేరస్తుడు కాజులూరులో రెక్కీ నిర్వహిస్తున్నాడన్న పక్కా సమాచారంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం కాకినాడ జిల్లా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితుడ్ని పట్టుకుని, అతడి వద్ద నుంచి 2 పిస్టల్స్ 17 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. నిందితుడు అరెస్ట్‌తో భారీ దోపిడీని పోలీసులు నియంత్రించడం జరిగిందన్నారు. నిందితుడిపై నర్సీపట్నంలో 3 కేసులు, అన్నవరం, నక్కపల్లి, తాడేపల్లిగూడెం, ఏలేశ్వరం పీఎస్‌లో తలో ఓ కేసు వెరసి మొత్తంగా ఒక చైన్ స్నాచింగ్, 4 రాత్రి, పగలు చోరీలు, ఓ బైక్ చోరీ కేసులు ఉన్నట్టు తెలిపారు. నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకోవడంలో కీలకంగా పనిచేసిన కాకినాడ రూరల్ సర్కిల్ పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, ఎస్ఐలు ఎంవీవీ రవీంద్రబాబు,ఎం.మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పిల్లి రాజు!

యానాం జీఎంసీ బాలయోగి వారధిపై ద్విచక్రవాహనం గుర్తింపు

ద్రాక్షారామ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు గణపతినగరం వద్ద కన్నబిడ్డలను కాలువలోకి తోసి కుమార్తె కారుణ్య(7)మరణానికి కారకుడైన పిల్లి రాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఈనెల 17న రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన ఫైనాన్స్ వ్యాపారి పిల్లిరాజు తన కుమారుడు రామసందీప్, కుమార్తె కారుణ్యలను పాఠశాల నుంచి తీసుకువచ్చి గణపతి నగరం వద్ద ఇంజరం కాలువలోకి తోసేశాడు. అనంతరం మోటారు సైకిల్‌పై పరారయ్యాడు. ఘటనలో కుమారుడు రామసందీప్ ప్రాణాలతో బయటపడగా కుమార్తె కారుణ్య (7) మృతిచెందింది. అప్పటి నుంచి రామచంద్రపురం సీఐ ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎం.లక్ష్మణ్ సిబ్బంది బృందాలుగా పిల్లి రాజు ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. మంగళవారం పిల్లి రాజు ఆచూకీ ఎవరికైనా తెలిస్తే పోలీసులకు తెలియచేయాలని రాజు ఫోటో కూడా పోలీసులు విడుదల చేశారు. బుధవారం రాజు మోటారు సైకిల్‌ను యానాం జీఎంసీ బాలయోగి వారధిపై గుర్తించారు. దీంతో రాజు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడనే కోణంలో సీఐ ఎం.వెంకటనారాయణ, ఎస్ఐ ఎం.లక్ష్మణ్ పవర్‌బోట్లపై యానాం నుంచి సముద్ర తీర ప్రాంతం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా రాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం. రాజు పోలీసులకు లొంగిపోయాడా లేదా అరెస్టు చేశారా అన్నది గురువారం తెలియనుంది. పిల్లి రాజు సజీవంగా పోలీసులకు చిక్కడంతో ఈ ఘాతుకం వెనుక పూర్వాపరాలు పోలీసులు వెల్లడించే అవకాశం ఉంది.

గంజాయి కేసులో మైనర్ సహా ఐదుగురి అరెస్ట్

నిడదవోలు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి నిడదవోలులో గంజాయితో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం నిడదవోలు పట్టణ పోలీస్‌స్టేషన్లో విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను సీఐ తిలక్ వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ 18న మంగళవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ కాలనీ సమీపంలో కొందరు గంజాయి కలిగి ఉన్నారనే సమాచారంతో పట్టణ పోలీసులు దాడి చేసి ఐదుగురు యువకులు, ఒక మైనర్ బాలుడిని అరెస్ట్ చేశామన్నారు. పట్టణంలోని కుమ్మరవీధికి చెందిన దాసరి పృథ్వీ వెంకట సాయి నితీష్, జగనన్న కాలనీకి చెందిన గడిచుకోట భానుప్రకాష్, చర్చిపేటకు చెందిన అక్కాబత్తుల బాలు, శింగవరం గ్రామానికి చెందిన మద్దాల భానుప్రకాష్, తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన పడాల భాగ్య శివ సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ కాలనీ చెందిన 17 ఏళ్ల మైనర్ బాలుడుని అరెస్ట్ చేసి వారి నుంచి సుమారు 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, దాని విలువ సుమారు రూ.55,225 ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ దాడుల్లో పట్టణ ఎస్ఐ జీఎస్ఆర్‌కె పరమహంస, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో లారీ డ్రైవర్ వీరంగం

రోడ్డుపక్క నిల్చున్న మహిళను, ఆగి ఉన్న ఆటోను లారీతో ఢీ

దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు



మద్యం మత్తులో ఉన్న లారీ డ్రైవర్‌ను కిందకు లాగి దేహశుద్ధి చేస్తున్న స్థానికులు



వేళంగి పీహెచ్‌సీలో క్షతగాత్రురాలు బేబి

కరప, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేళంగిలో బుధవారం మధ్యాహ్నం మద్యం మత్తులో ఒక లారీ డ్రైవర్ వీరంగం సృష్టించాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామచంద్రపురం నుంచి కాకినాడ వైపు వెళ్తున్న లారీ వేళంగి వచ్చేసరికి అదుపు తప్పింది. స్థానిక నిత్యానందపురం సెంటర్ మలుపు తిరిగాక రోడ్డు పక్కన నిల్చున్న ఒక మహిళను, ఆగి ఉన్న ఆటోను, బజ్జీల బండిని లారీ డ్రైవర్ ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయే ప్రయత్నం చేశాడు. స్థానికులు వెంటపడి పట్టుకోగా డ్రైవర్ ఫూటుగా మద్యం తాగి మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. దీంతో చిర్రెత్తుకొచ్చిన పలువురు స్థానికులు డ్రైవర్‌ను కిందకు లాగి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పజెప్పారు. లారీ డ్రైవర్‌ను రామచంద్రపురానికి చెందిన రామకృష్ణ రాజుగా గుర్తించారు. ఈ ప్రమాదంలో కాజులూరు మండలం కుయ్యేరు గ్రామానికి చెందిన బండి బేబి గాయపడగా, ఆటో, బజ్జీల బండి ధ్వంసమయ్యాయి. క్షతగాత్రురాలికి వేళంగి పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ తోట సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గోల్డ్ చైన్ చోరీ

కొవ్వూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు మహిళ మెడలో ఆరున్నర కాసుల బంగారు చైన్ దొంగిలించుకుపోయిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో జరిగింది. కొవ్వూరు 23వ వార్డు, చిట్టూరివారి వీధికి చెందిన కుందుల పద్మకుమారి పట్టణంలోని ఏసిఆర్ లాడ్జి సమీపంలోని పాలింపాటి నరసయ్యనగర్‌లో బుధవారం సాయంత్రం వాకింగ్ చేస్తుంది. వెనుక నుంచి వచ్చిన వ్యక్తి మెడలో ఉన్న ఆరున్నరకాసుల బంగారు చైన్ తెంపుకుని బైక్‌పై దొమ్మేరు రోడ్‌లోకి వెళ్లిపోయాడని బాధితురాలు తెలియజేసింది. కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్, సీఐ పి.విశ్వం, ఎస్ఐ కె.జగన్మోహనరావు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించి సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసినట్టు సీఐ విశ్వం తెలిపారు.

డెల్టా కాలువలకు 10,700 క్యూసెక్కులు విడుదల

ధవళేశ్వరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాటన్ బ్యారేజ్ నుంచి డెల్టా కాలువలకు 10,700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 3200 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2వేల క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 5500 క్యూసెక్కులు చొప్పున సాగునీరు విడుదలవుతోంది. సీలేరు నుంచి విడుదలవుతున్న నీటితో కలిపి గోదావరిలో నీటి లభ్యత 10,551 క్యూసెక్కులుగా ఉంది. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10 అడుగులుగా నమోదయ్యింది.

సత్యదేవుని సన్నిధిలో సీఐఎస్ఎఫ్ బృందం పూజలు

అన్నవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో బుధవారం కేంద్ర పారిశ్రామిక భద్రత దళం (సీఐఎస్ఎఫ్)సైకిల్ ర్యాలీ సభ్యులు సత్యదేవుని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు దగ్గరుండి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం పశ్చిమ రాజగోపురం వద్ద నుంచి ర్యాలీని ఈవో సుబ్బారావు జెండా ఊపి పునఃప్రారంభించారు. ఈ బృందం 25 రాష్ట్రాల్లో 358 యూనిట్లతో 2లక్షల మంది దేశం నలుమూలలా అంతర్గత పరిరక్షణలో పాత్ర పోషించడం అభినందనీయమని ఈవో పేర్కొన్నారు.



సత్యదేవుని దర్శనానంతరం సీఐఎస్ఎఫ్ బృంద సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఈవో

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కాట్రేనికోన, మార్చి19(ఆంధ్రజ్యోతి): పురుగు మందులు వాడకుండా ఆరోగ్యవంతమైన పంటలు పండించే ప్రకృతి వ్యవసాయ విధానంపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం వీఏఏలు, డీఆర్డీఏ వీవోఏలు, వ్యవసాయ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా రీసర్వే

రాజోలు, మార్చి 19(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే పనిని ఎంతోప్రతిష్టాత్మకంగా చేపట్టిందని రైతులంతా సహకరించాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి అన్నారు. పొన్నమండలో బుధవారం జరిగిన గ్రామసభలో ఆమె మాట్లా డారు. తహశీల్దార్ ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ రాజు, వీఆర్వోలు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలుకు ఈకేవైసీ తప్పనిసరి

● జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్


మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్

అమలాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల సమగ్రంగా అమలు చేసేందుకు నూరుశాతం ఈకేవైసీ పూర్తి చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయ భాస్కర్ పేర్కొన్నారు. పౌరులకు భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో బుధవారం జిల్లాలోని రేషన్ డీలర్లకు ఈకేవైసీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకేవైసీని పూర్తి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ప్రతీ రేషన్ షాపులోను డీలర్లు తమ ఇ-పాస్‌యంత్రంతో అందుబాటులో ఉంటూ ఉదయం 8నుంచి 12 గంటల వరకు సాయంత్రం 4నుంచి రాత్రి 8గంటల వరకు ఈకేవైసీ చేయాలన్నారు. ఈనెల 20 నుంచి 31వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి నిరంతరాయంగా పొందేందుకు వీలుగా తప్పనిసరిగా చేసుకోవాలని ఆదేశించారు. ఈప్రక్రియకు సంబంధించి రాష్ట్రమంతా ఒకే వెబ్‌సైట్ ఉన్నందున రాష్ట్రంలో ఎక్కడి వారైనా సరే ఎక్కడైనా ఈకేవైసీ చేయించుకోవచ్చునన్నారు. దీనిపై మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రోత్సహించాలని ఉదయభాస్కర్ పేర్కొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

కాట్రేనికోన, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డులో పేరు నమోదైన ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని తహశీల్దార్ పి.సునీల్‌కుమార్ సూచించారు. ఈకేవైసీ చేయించుకోకపోతే రేషన్ నిలిచిపోవడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సైతం లభించవన్నారు. అన్ని రేషన్ దుకాణాలు, మీసేవ, ఆధార్ కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవచ్చన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం



అమలాపురంలో మాల సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా, ముమ్మిడివరంలో మాలమహానాడు నాయకుల ర్యాలీ

అమలాపురం, ముమ్మిడివరంలో ఆందోళన

అమలాపురం టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): దళితులపై కక్ష కట్టి రాజ్యాంగ విరుద్ధంగా ఎస్సీల్లో ఒక వర్గానికి లబ్ధి చేకూర్చే విధంగా ప్రభుత్వం వర్గీకరణ చేయడాన్ని నిరసిస్తూ మాల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఐక్య వేదిక ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తొలుత అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో జంగా బాబూరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. మాలల పంతం.. చంద్రబాబు అంతం, ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అసెంబ్లీలో బిల్లు పెట్టి ఏకపక్షంగా ఆమోదించాలని చూస్తే చలో అసెంబ్లీకి పిలుపు ఇస్తామన్నారు. కన్వీనర్ జంగా బాబూరావుతో పాటు కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, అముడా మాజీచైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, గెడ్డం సురేష్‌బాబు, రేవు తిరుపతిరావు, పొలమూరి మోహన్‌బాబు, నెల్లి లక్ష్మీపతి, పెనుమాల చిట్టిబాబు, కప్పల శ్రీధర్, బొంతు మణిరాజ్, గూటం సాయి, వైవీ, దేవరపల్లి శాంతికుమార్, జిత్తుక సత్యనారాయణ, పెయ్యల ప్రతాప్, ఉబ్బన శ్రీను పాల్గొన్నారు.

వర్గీకరణను వ్యతిరేకిస్తూ రాస్తారోకో

ముమ్మిడివరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్ర కేబినెట్ తీర్మానం చేయడాన్ని వ్యతిరేకిస్తూ మాలమహానాడు ఆధ్వర్యంలో ముమ్మిడివరంలో బుధవారం రాస్తారోకో, ధర్నా, నిరసన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ భవనం నుంచి నిరసన ర్యాలీని తహశీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించారు. అక్కడ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు, రిపబ్లికన్ పార్టీ రిటైర్డ్ ఎస్సీ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో మెమోరాండం అందించారు. కార్యక్రమంలో కాశి జగపతిరావు, దేవరపల్లి ఏడుకొండలు, జనిపల్లి సత్యనారాయణ, పీవీ చక్రవర్తి, చీకురుమెల్లి శ్రీనివాస్, ఎం.ఆశీర్వాదం, పెయ్యల పరశురాముడు, మోకా రామారావు, నల్లా రాంజీ, కాశి సాయి తదితరులు పాల్గొన్నారు.

యానాం సమస్యలపై నాయకులతో సమీక్ష



యానాం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): యానాం ప్రజలు ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలపై స్థానిక నాయకులతో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక యర్రా గార్డెన్స్‌లోని తన స్వగృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా డంపింగ్ యార్డు వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు గురించి నాయకులు వివరించారు. యానాం శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన అంశాలపై మాట్లాడారు.నిధులు సమీకరణ, దాతల సహకారం, ఆలయ నిర్మాణ పనులు తదితర అంశాల వివరించారు. యానాంలో ప్రాంతానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు మల్లాడి శామ్యూల్, శేరు కృష్ణ, పెండెం సూర్యప్రకాష్, గుత్తుల గోవింద జయరామారావు, గూటం శివగణేష్, చీకట్ల సత్యనారాయణ, మట్టపర్తి లోవరాజు, చొల్లంగి హనుమంతరావు పాల్గొన్నారు.

తువ్వ మట్టి ర్యాంపునకు.. అనుమతులు ఉన్నాయా లేవా?

స్థానికుల ఫిర్యాదుతో ర్యాంపులోకి రెవెన్యూ సిబ్బంది

పి.గన్నవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలంలోని మానేపల్లి శివారు నదీ పరివాహక ప్రాంతంలో తువ్వ మట్టి తవ్వకాలకు కొందరు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న ఆర్ఐ డాంగే, వీఆర్వో సత్యనారాయణ బుధవారం ర్యాంపులోకి వచ్చారు. తువ్వ మట్టి లారీని అడ్డుకోవాలని వీఆర్ఏ శ్రీనివాస్‌కు సూచించారు. వీఆర్ఏ లారీని అడ్డుకోగా తవ్వకాలకు అనుమతులున్నాయని ర్యాంపు నిర్వాహకులు తెలిపారు. దీనిపై ఆర్ఐను వివరణ కోరగా ర్యాంపునకు అనుమతులు ఉన్నాయని చెబుతున్నారని, తమ దగ్గర సంబంధిత పత్రాలు లేవని చెప్పారు. మానేపల్లి శివారు పల్లిపాలెం సమీపంలో తువ్వ మట్టి తవ్వకాలకు అనుమతులున్నాయంటూ నిర్వాహకులు 2కిలోమీటర్ల మేర బాటను సిద్ధం చేసుకుంటున్నారు. దీనిపై స్పష్టమైన వివరణ కోసం తహశీల్దార్ పి.శ్రీపల్లవిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు. ఈ తువ్వ మట్టిని ప్రభుత్వ పనుల నిమిత్తం వినియోగించేందుకు ర్యాంపుకు అనుమతులు ఇచ్చారని సమాచారం.

విద్యార్థుల క్షేత్ర పరిశీలన

అమలాపురం టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన ప్రోగ్రాం డైరెక్టర్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ విద్యార్థులు డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులు, ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలపై బుధవారం క్షేత్ర పరిశీలన చేశారు. మొదటి సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు బండారులంక మట్టపర్తివారిపాలెంలో డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న పీచు తాడు, పోకచెక్కలు, వక్కపొడి తయారీ విధానాల ప్రాజెక్టులను పరిశీలించారు. డ్వాక్రా సంఘ రుణాలు, శ్రీనిధి రుణాలతో చేస్తున్న వ్యాపారం తీరును అధ్యయనం చేశారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్, ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులు డ్వాక్రా మహిళలతో మమేకమయ్యారు. గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించారు. వెలుగు ఏపీఎం అయితాబత్తుల సురేంద్ర, సీసీలు రమేష్, దుర్గాకుమారి, డ్వాక్రా మహిళలు కడలి విజయ, కేతా రాధ పాల్గొన్నారు.

రూ.2కోట్లతో ఈదరపల్లి వంతెన నిర్మాణం

● ఆక్రమణల తొలగింపునకు అధికారులతో కమిటీ ఏర్పాటు
● ఆక్రమణలపై నివేదిక ఇవ్వాలి : కలెక్టర్
● హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు




ప్రస్తుత ఈదరపల్లి వంతెన దృశ్యం, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య నివారణకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికార యంత్రాంగం ఎట్టకేలకు దృష్టి సారించింది. జిల్లాకేంద్రమైన అమలాపురం పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుంది. గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుంటున్న ప్రజల కష్టాలను పరిశీలించిన కలెక్టర్ పట్టణంలోకి వచ్చే ప్రధాన వారధుల నిర్మాణంపై దృష్టి పెట్టారు. దీనిలో భాగంగా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ రూ.2కోట్ల అంచనా వ్యయంతో ఈదరపల్లి వంతెన వద్ద నూతన వంతెన నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్టు వెల్లడించారు. ప్రధానంగా ఈదరపల్లి వంతెన వద్ద ట్రాఫిక్ సమస్య అనూహ్యంగా పెరిగిపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వివాహాల సమయంలో పెళ్లి వాహనాలు సైతం సకాలంలో గమ్యస్థానాలకు చేరని పరిస్థితి ఉంది. ప్రధాన పంటకాల్వపై గతం నుంచి ఉన్న వంతెన శిథిలస్థితికి చేరుకున్న నేపథ్యంలో అక్కడే కొత్త వంతెన నిర్మాణానికి శ్రీకారం చుడతారని అధికారులు పేర్కొంటున్నారు. ఈ వారధి నిర్మాణం పూర్తయితే పట్టణంలో ప్రధాన ట్రాఫిక్ సమస్యకు తెర పడనుంది.

ఆక్రమణల తొలగింపునకు ఆర్డీవో ఆధ్వర్యంలో కమిటీ

ఈదరపల్లి వంతెన వద్ద నూతన వారధి నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేస్తున్నట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ బుధవారం వెల్లడించారు. ఈవారధి నిర్మాణంలో భాగంగా ఈదరపల్లి ప్రస్తుత వంతెన వద్ద ఇరువైపులా ఉన్న ఆక్రమణల తొలగింపునకు వివిధ శాఖల అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. రోజురోజుకు ట్రాఫిక్ సమస్య పెరిగిపోవడం వల్ల అంబులెన్సు వెళ్లలేని పరిస్థితులు నెలకొనడంతో పాటు పట్టణ ప్రజలు పడుతున్న కష్టాలను ప్రత్యక్షంగా పరిశీలించిన కలెక్టర్ మహేష్‌కుమార్ కలెక్టరేట్ నుంచి రూ.2కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. కొత్తగా ఏర్పడ్డ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పురాతన వంతెనల స్థానే కొత్త వంతెనల నిర్మాణంతో పాటు ట్రాఫిక్ రద్దీని తట్టుకునే రీతిలో రోడ్ల విస్తరణ చేపట్టాల్సి ఉందని అభిప్రాయ పడ్డారు. బ్రిటీషు కాలంలో నిర్మించిన వంతెనలపైనే నేటికీ ప్రయాణిస్తున్న దృష్ట్యా ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుందని, ప్రస్తుత ప్రజల అవసరాలకు అనుగుణంగా వంతెనలు, రహదారుల నిర్మాణాన్ని చేపట్టాల్సిన ఆవశ్యకతను గుర్తించారు. ఆర్డీవో కె.మాధవి, ఆర్అండ్‌బీ ఎస్ఈ బి.రాము, ఇరిగేషన్ డీఈ పి.శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో ఎస్ఈ రాజబాబు, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తదితరులతో ఆక్రమణల తొలగింపు కోసం కలెక్టర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఆక్రమణలను గుర్తించి తొలగించడంతో పాటు విద్యుత్ స్తంభాలు, ఇతర షాపుల తొలగింపునకు నివేదిక రూపొందించిన తరువాత తదుపరి చర్యలు చేపడతామని అధికారులు పేర్కొన్నారు. కలెక్టరేట్ ఏవో కె.కాశీవిశ్వేశ్వరరావు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సైక్లోథాన్ సైకిల్ ర్యాలీ


సైక్లోథాన్ సైకిల్ ర్యాలీ బృందంతో జిల్లా ఎస్పీ కృష్ణారావు, డిప్యూటీ కమాండర్ ప్రభాకర్

అమలాపురంలో ఘనస్వాగతం

అమలాపురం టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతాల్లో జాతీయ భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన సైక్లోథాన్ సైకిల్ ర్యాలీ బుధవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌కు చేరుకుంది. సురక్షిత తీరాలు.. సుసంపన్న భారతదేశం అనే స్ఫూర్తితో తీర ప్రాంతాల వెంబడి మాదకద్రవ్యాలు, ఆయుధాలు, పేలుడు పదార్థాలతో సహా అక్రమ రవాణావల్ల జరిగే నష్టాలను వివరిస్తూ ఈ ర్యాలీని చేపట్టినట్టు దళ డిప్యూటీ కమాండర్ వీకే ప్రభాకర్ తెలిపారు. సైకిల్ ర్యాలీ గడియార స్తంభం సెంటర్‌కు చేరుకోగానే పట్టణ పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా డిప్యూటీ కమాండర్ ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర పారిశ్రామిక భద్రత దళం 56వ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా గ్రేట్ ఇండియన్, కోస్టల్ సైక్లోథాన్‌ను ప్రారంభించామన్నారు. అసిస్టెంట్ కమాండర్ ఏకే సింగ్ మాట్లాడుతూ అంకితభావం కలిగిన సైక్లిలిస్టులు 25రోజులపాటు 11 రాష్ట్రాలమీదుగా కఠినమైన ప్రయాణాన్ని చేపట్టారన్నారు. అసిస్టెంట్ కమాండర్ ఎస్కే సప్తపది మాట్లాడుతూ మార్గ మధ్యలో సీఐఎస్ఎఫ్ బృందాలు పాఠశాల విద్యార్థులతో పాటు ఎన్‌సీసీ గ్రూపుల సభ్యులను కలిసి భద్రతా దళాలు చేస్తున్న సేవలను వివరించామన్నారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు మాట్లాడుతూ ఉగ్రవాదుల చర్యలను అరికట్టడంలో సీఐఎస్ఎఫ్ కృషి ఎంతో ఉందన్నారు. అనంతరం చిన్నారుల శాస్త్రీయనృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, సైక్లోథాన్ కమాండర్ సభ్యులు శ్రీనివాస్, శ్రీకర్, లోహియా, మాజీ సైనికుడు కటకం పూర్ణచంద్రరావు, వీరనారీమణులు అమ్మన్నమ్మ, వంజరాపు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేదవేదాంగాలను ఔపాసన పట్టిన యోగి శ్రీరామశర్మ

అమలాపురం టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వేదవేదాంగాలతో పాటు పురాణేతిహాసాలను ఔపాసన పట్టిన మహనీయుడు, ఎందరికో వేద విద్యను అందించిన మహనీయుడిగా చిర్రావూరి శ్రీరామశర్మ నిలుస్తారని ఈవని రామచంద్రసోమయాజి పేర్కొన్నారు. అమలాపురం ఏఎస్ఎన్ మహిళా కళాశాల ప్రాంగణంలో కోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ, ఆపస్తంబ పురోహిత పరిషత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో చిర్రావూరి శ్రీరామశర్మ సంస్మరణ సభ బుధవారం రామచంద్ర సోమయాజి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహామహోపాధ్యాయ డాక్టర్ శ్రీరామశర్మ కారణ జన్ములని పేర్కొన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. గుళ్లపల్లి ప్రభాకరఫణిరాజా, గొర్తి సాయి, గుళ్లపల్లి వెంకట్రామ్, యేడిద నలిణీకుమార్, భగవత్‌శాస్త్రి, పిన్నమనేని వీరవెంకటసత్యనారాయణవర్మ, తోపెల్ల కార్తీక్, కర్రా సుబ్రహ్మణ్య శర్మ, మండలీక ఆదినారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యదర్శి నాతి హౌస్ అరెస్టు

అల్లవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మాల మహానాడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడికి పిలుపునిచ్చిన గోడిలంకకు చెందిన మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి నాతి శ్రీనివాసరావును పోలీసులు హౌస్‌అరెస్టుచేశారు.

ఆరోగ్యంతోనే లక్ష్యాలు సాధ్యం

యానాం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మహిళలు ఎక్కడయితే గౌరవించబడతారో అక్కడే మహిళా సాధికారత సాధ్యం అవుతుందని, స్త్రీలు అన్ని రంగాల్లో ముందుకెళ్లగలుగుతారని యానాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమావేశపు హాలులో స్త్రీ శివ సంక్షేమశాఖ, కళాశాల సంయుక్త నిర్వహణలో మహిళలపై హింస నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. భాస్కరరెడ్డితో పాటు డాక్టర్ మెల్లం ప్రమీల, కె.శ్రీలత, ఎస్ఐ సీతారత్నం, మిషన్ శక్తి కోఆర్డినేటర్ రోజ్‌లిన్ మాట్లాడారు. స్త్రీలు ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తే తద్వారా అనుకున్న లక్ష్యాలను సాధిస్తారన్నారు. ఎస్ఆర్‌కే ప్రభుత్వ కళాశాల, మదర్ థెరిస్సా నర్సింగ్ కళాశాల, అంబేడ్కర్ పాలిటెక్నిక్ విద్యార్థులు, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

అయినవిల్లి ఎస్ఐగా హరికోటిశాస్త్రి



అయినవిల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి ఎస్ఐగా హరికోటిశాస్త్రి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండపేట నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు.

పది పరీక్షలు ప్రశాంతం

ముమ్మిడివరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలో ఐదు పరీక్షా కేంద్రాల్లో బుధవారం జరిగిన హిందీ పరీక్షకు 753మంది విద్యార్థులకు 751మంది హాజరయ్యారు.

ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద 17వ రోజు దీక్ష

అల్లవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఓడలరేవు గ్రామాభివృద్ధి, స్థానిక యువకులకు ఉపాధి వంటి డిమాండ్లపై గ్రామస్తులు ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద చేపట్టిన రిలే దీక్షలు బుధవారం 17వ రోజుకు చేరుకున్నాయి. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, రాష్ట్రశెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావులు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్‌బాబు, కొప్పాడి వెంకటరామకృష్ణారావు, పెమ్మాని వెంకటరామారావు, మందపాటి రామకృష్ణ, రేకాడి శేషగిరి, గుండుమేను శ్రీనివాస్, గుబ్బల నాగేశ్వరరావు, పెమ్మాడి వెర్రియ్య, కొల్లు త్రిమూర్తులు దీక్షలో పాల్గొన్నారు.

మంచినీటి చెరువు పనుల పరిశీలన

అల్లవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నంలో మంచినీటి చెరువు పనులను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు పరిశీలించారు. ప్రభుత్వ పాలనలో తాగునీటి సమస్యను తీర్చడానికి మంచినీటి చెరువు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని మెట్ల అన్నారు. సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, డీసీఎం చైర్మన్ దాట్ల గోపీరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ జి.స్వామి, మంతెన సురేష్‌రాజు, గునిశెట్టి రోహిణీకుమార్, కొమ్మూరి సత్తిబాబు, పరసా కిరణ్, పిండి గణపయ్య, నల్లా రాము, లింగం శ్రీనివాస్, కటికిరెడ్డి బాబి పాల్గొన్నారు.

బహుళ కేంద్రం పరిశీలన

అల్లవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో బహుళ కేంద్రాన్ని జిల్లా సమగ్రశిక్ష సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం సందర్శించి విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. ప్రతీ వారం నిర్వహించే ఫిజియోథెరపీని పరిశీలించారు. విద్యా నైపుణ్యాలపై దివ్యాంగ పిల్లలకు సూచనలు చేశారు. మండల విద్యాశాఖ అధికారి-2 ఎస్.ఏడుకొండలు పాల్గొన్నారు.

పంటబోదె ఆక్రమణలు తొలగించండి

అంబాజీపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సాగునీరు వెళ్లే పంటబోదెను ఆక్రమించుకున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఇసుకపూడి, చిరతపూడి గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహశీల్దారు వెంకటేశ్వరరావుకు రైతులు వినతిపత్రాన్ని అందిచారు. పంటబోదెను ఇద్దరు వ్యక్తులు ఆక్రమించుకుని నీరు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

పెద్దింట్లమ్మ ఆదాయం రూ.5,98,613

అంతర్వేది, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెం గ్రామం చిన్నకొల్లేరులో వెలసి ఉన్న శ్రీపెద్దింటమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు సమక్షంలో 19రోజులకు రూ.5,98,613 ఆదాయం వచ్చిందని అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. విదేశీ కరెన్సీ పది దిరమ్సు వచ్చాయన్నారు. ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, ఉండపల్లి అంజి పాల్గొన్నారు.

సాయం అందజేత

ముమ్మిడివరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): లంకాఫ్ ఠాణేలంక గ్రామంలో గుబ్బల రామసత్యనారాయణ-ఉదయలక్ష్మి దంపతులు కొంత కాలంగా టీబీ వ్యాధితో బాధపడుతున్నారు. ఏ.వేమవరం నామాలవారిపాలేనికి చెందిన ముషిణి రాంబాబు ఆర్థికసాయంతో నిత్యావసర వస్తువులు, కిరాణా, బియ్యం, కాయగూరలు సమకూర్చారు. వాటిని ఆ కుటుబానికి సాయిసంజీవిని మహిళా నడక యోగా ఆరోగ్య సేవాసంస్థ అధ్యక్షురాలు జల్లి సుజాత అందజేశారు. కన్నెపాముల వెంకటేశ్వరశ్రీదేవి, గొల్లపల్లి గోపి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన సమాజం

మలికిపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణమవుతుందని, ఆ దిశగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన ఉండాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ రమ్యప్రియాంక అన్నారు. బుధవారం మండల వెలుగు కార్యాలయంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు, వీవోఏలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రమ్యప్రియాంక మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రకృతి వ్యవసాయంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో మహిళా సంఘాలను, వీవోఏలను భాగస్వామ్యం చేయడం ద్వారా ప్రజలను చైతన్యవంతం చేసినట్టు అవుతుందన్నారు. డి.భవానీ, నగీన, నాగరాజు, జోసెఫ్, శ్రీనివాసరావు, కిరణ్, చిట్టిబాబు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులకు పరామర్శ

మలికిపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మోరిపోడు మాజీ సర్పంచ్ యెనుముల వెంకటనాగసత్యవతి మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులను పలువురు ప్రముఖులు పరామర్శించారు. టీడీపీ సఖినేటిపల్లి మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని, మోరిపోడు సర్పంచ్ ముప్పర్తి అలివేలుగంగాత్రివేణి, మాజీ సర్పంచ్ ముప్పర్తి త్రిమూర్తు, మలికిపురం సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, గెడ్డం తులసీభాస్కర్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

సంతమార్కెట్‌లో ఆక్రమణల తొలగింపు

మామిడికుదురు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడి గ్రామంలోని సంత మార్కెట్‌లో ఉన్న ఆక్రమణలను బుధవారం పంచాయతీ అధికారులు తొలగించారు. సంతమార్కెట్‌లో ఇష్టారాజ్యంగా ఆక్రమణలు జరగడంతో స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై గ్రామ పంచాయతీ అధికారులు బుధవారం ఆక్రమణలు తొలగించారు. మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, సర్వే అసిస్టెంట్ వంశీ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఆక్వా రైతులను తక్షణమే ఆదుకోవాలి

అమలాపురంరూరల్, మార్చి19(ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్‌చేస్తూ కొంకాపల్లిలోని క్షత్రియ కల్యాణ మండపంలో బుధవారం రైతుల సమావేశం నిర్వహించారు. ఆక్వారైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు.విద్యుత్‌శాఖ అధికారులు దాడుల పేరుతో రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వారైతు సంఘ నాయకులు యాళ్ల వెంకటానందం, అల్లూరి రమేష్‌రాజు, చవటపల్లి నాగభూషణం, దెందుకూరి సత్తిబాబురాజు, రుద్రరాజు నానిరాజు, మేడిద శంకరం, సత్తి శ్రీను, గుమ్మళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

అమలాపురం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బైపాస్ రోడ్డు జంక్షన్లలో జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం భట్నవిల్లి నుంచి బోడసకుర్రు వంతెన వరకు బైపాస్ రోడ్డు జంక్షన్‌లలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాద ప్రాంతాలను పోలీసు, హైవే అథారిటీ అధికారులు పరిశీలించారు. కామగరువు బైపాస్ రోడ్డు జంక్షన్ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాల వేగం తగ్గించేందుకు స్పీడు బ్రేకర్లు, సిగ్నల్ లైట్లు వంటివి ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. బైపాస్ రోడ్డు దాటేటప్పుడు వాహనదారులు నెమ్మది పాటించాలన్నారు. ఆయన వెంట తాలూకా సీఐ డి.ప్రశాంత్‌కుమార్, తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు, పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు, హైవే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

50లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం లక్ష్యం



అమలాపురం రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): విచక్షణా రహితంగా పురుగుమందులు, ఎరువులు వినియోగించడం ద్వారా భూసారం పూర్తిగా క్షీణిస్తుందని మండల వ్యవసాయాధికారి కడలి ధర్మప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. అమలాపురం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీ కమ్యూనిటీ ప్రకృతి వ్యవసాయం, డీఆర్డీఏ, రైతు ప్రతినిధులతో బుధవారం కన్వెర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఏపీ సీఎన్ఎఫ్ జిల్లా ఏవో శ్రీనివాస్ మాట్లాడుతూ జీవామృతం, ఘనజీవామృతాలను ప్రకృతి సిద్ధంగా తయారుచేసి పంటకు వినియోగిస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. ఏపీఎం అయితాబత్తుల సురేంద్ర, మాస్టర్ ట్రైనర్ ఎం.సూరిబాబు, ఏఈవో ప్రేమ్‌కుమార్, ఇన్‌చార్జి అప్పారి వెంకటరమణ, కొలిశెట్టి త్రిమూర్తులు, వివిధ గ్రామాల డ్వాక్రా సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి

మామిడికుదురు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భూ యజమానులు రీసర్వేకు సహకరించాలని తహశీల్దార్ సుబ్రహ్మణ్యాచార్యులు కోరారు. రీసర్వేపై అవగాహన కల్పిస్తూ మొగలికుదురు, బి.దొడ్డవరం గ్రామాల్లో బుధవారం ర్యాలీ న్విహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ భూయజమానులు తమ రికార్డులతో రీసర్వేకు హాజరై తమ భూముల రికార్డులను సరిచేసుకుని రీసర్వేకు సహకరించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు చెల్లుబోయిన శివరామసుబ్రహ్మణ్యం, కడి అరుణకుమారి, ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటరమణ, డిప్యూటీ తహశీల్దార్ కె.శరణ్య, సర్వేయర్ వాణి, వీఆర్వోలు ఆర్.ఝాన్సీ, ఎ.బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసన

మామిడికుదురు, మార్చి19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మాలమహానాడు నాయకులు బుధవారం నిరసన చేపట్టారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. 2025లోజనాభా లెక్కలు నిర్వహించి వర్గీకరణ చేయాలన్నారు. మాలమహానాడు నాయకులు బొంతు మణిరాజు, కలిగితి పల్లంరాజు, మట్టా సత్తిబాబు, పిల్లి శ్రీను, శేఖర్, కె.ప్రకాశరావు పాల్గొన్నారు.

నకిలీ దస్తావేజుల కేసులో మరొకరికి రిమాండ్

రాజోలు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): నకిలీ దస్తావేజులు సృష్టించి ఒకరికి విక్రయించిన భూమిని వేరొకరికి అమ్మచూపిన కేసులో రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన వల్లూరి అచ్చుకుమారి అలియాస్ దంగేటి అచ్చుకుమార్‌ను అరెస్టుచేసినట్టు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ బుధవారం తెలిపారు. అతడికి కోర్టు రిమాండ్ విధించిందన్నారు. ఈకేసులో ఇప్పటికే వెంటూరు గ్రామానికి చెందిన వల్లూరి రామసుబ్బరాయలు, రామచంద్రపురం మండలం నర్సాపురపుపేటకు చెందిన పిల్లి సూర్యనారాయణను అరెస్టు చేశామన్నారు. ఈకేసులో పరారీలోఉన్న కొంతమంది నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని ఎస్ఐ రాజేష్‌కుమార్ తెలిపారు.

23న మెగా ఆర్యవైశ్య వధూవరుల పరిచయవేదిక

రాజోలు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలం చాకలిపాలెం కృష్ణబాలాజీ ఫంక్షన్ హాలులో ఈనెల23న మెగా ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక ఏర్పాటుచేసినట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి తెలిపారు. ఈసందర్భంగా తాటిపాకలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీ ఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళపు శివరామసుబ్రహ్మణ్యం ఆశీస్సులతో, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పరిచయవేదికకు ఉత్తరాంధ్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 650మందికి పైగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. రాజోలు చాంబర్ ఆఫ్‌కామర్స్ అధ్యక్షుడు కాసు శ్రీను, కంచర్ల కృష్ణమోహన్, కుసుమంచి పాపారావు, ప్రగళ్లపాటి కనకరాజు, లక్కింశెట్టి బాబులు, కుసుమంచి పాపారావు, గ్రంథి గణేష్, గుప్తా, నాళం కిట్టు, కుమారకృష్ణ, పోశెట్టి సూరిబాబు, సింగంశెట్టి కుమార్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ఐ.పోలవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పశువుల్లంక పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం కపిలేశ్వరపురం ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎస్.అనూష, వీవీ సత్యనారాయణ, ఎస్.విజయ్‌సునంద, పి.కొండలరావు, ఎం.వెంకటేష్‌లు వైద్యపరీక్షలు చేశారు. కొందర్ని శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. ధూళిపూడి చక్రం, సర్పంచ్ సఖిలే పెద్దిరాజు, కార్యదర్శి పి.రవిరాజు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు వ్యాపార రుణాలు

ఉప్పలగుప్తం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం విజ్ఞప్తి చేశారు. బుధవారం భీమనపల్లిలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులుగా ఉన్న 21-60ఏళ్లవారు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు రేషన్ కార్డుతో ఈనెల22లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు 40నుంచి 50 శాతం రాయితీపై రుణాలు ఇస్తారన్నారు. జనరిక్ మందుల షాపు ఏర్పాటుకు రూ.8లక్షల వరకు కార్పొరేషన్ ద్వారా రుణం మంజూరవుతుందన్నారు.

మాలమహానాడు నిరసన

మలికిపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడంపై మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో ఎస్సీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మలికిపురం తహశీల్దార్ పి.శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వనిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తాజాగా షెడ్యూల్డు కులాలకు సంబంధించి కులగణన చేపట్టి ఎస్సీల్లో ఉపకులాల జనాభా ఎంత ఉందో తేల్చి చెప్పాలని జేఏసీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాల సామాజికవర్గంపై కక్ష సాధింపు చర్యలు విడనాడాలని కోరారు. వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో తోటే రాజేష్, తాడి సహదేవ్, నల్లిశివ, గెడ్డం తులసీభాస్కర్, గెడ్డం ఫిలిప్‌రాజు, సరెళ్ల విజయ్ ప్రసాద్ పాల్గొన్నారు.

అయినవిల్లి ఎస్ఐగా హరికోటి శాస్త్రి



అయినవిల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి ఎస్ఐగా హరికోటిశాస్త్రి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండపేట ఎస్ఐగా పనిచేస్తున్న హరికోటిశాస్త్రి బదిలీపై అయినవిల్లి వచ్చారు.

స్వామివారి రథానికి శాశ్వత పరిష్కారం

● చొరవ చూపిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



వాడపల్లి వెంకన్న ఆలయంలో రథం

ఆత్రేయపురం, మార్చి19(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథోత్సవం చారిత్రతకతను సంతరించుకుంది. 1931 మార్చి 30న స్వామివారి రథోత్సవంపై పూజ్యబాపూజీ స్వరాజ్య జెండాను దేశభక్తులు ఎగురవేశారు. బ్రిటీష్ పాలకులు తొలగించాలని ఆదేశించిన దేశభక్తులు ససేమీరా అనడంతో బ్రిటీష్ పాలకులు కాల్పులు జరిపారు. ఈ రథోత్సవంలో నలుగురు వీరమరణం పొందారు. రథోత్సవం అంతటి ప్రసిద్ధిగాంచింది. అప్పటి నుంచి రథోత్సవం నిర్వహించకపోవడంతో శిథిలమైన రథం వద్ద ప్రతిఏటా పూజలు నిర్వహించేవారు. 2017లో టీడీపీ ప్రభుత్వహయాంలో వాడపల్లి గ్రామపెద్దలు స్వామివారి రథం నిర్మించేందుకు నడుంబిగించారు. దాతల సహకారంతో సుమారు రూ.32లక్షలతో రథం నిర్మించారు. 86ఏళ్ల అనంతరం స్వామివారి రథోత్సవాన్ని శ్రీకారం చుట్టారు. 2017 ఏప్రిల్ 30న జరిగిన స్వామివారి కల్యాణోత్సవంలో ఈ రథోత్సవం నిర్వహించారు. అప్పటి ఆలయ చైర్మన్ కరుటూరి నరసింహరావు ఆధ్వర్యంలో స్వామివారి రథోత్సవం బ్రహ్మాండంగా నిర్వహించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ స్వామివారి రథాన్ని బరకాలు కప్పి సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచారు. ఎనిమిదేళ్ల నుంచి ఆరుబయట ఉన్న రథాన్ని భద్రపరిచేందుకు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచనల మేరకు ఆలయ ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు కోనేరు సమీపంలోని స్థలాన్ని కేటాయించారు. రూ.32లక్షల వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించారు. ఏప్రిల్ నెలలో స్వామివారి కల్యాణోత్సవాల అనంతరం స్వామివారి రథాన్ని భద్రపరిచేందుకు శాశ్వత నిర్మాణాన్ని చేపట్టనున్నారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.3.40లక్షలు

ఆత్రేయపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజ లు, నిత్యకళ్యాణాలునిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవలద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,40,356 లభించినట్లు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అలాగే గోవిందమాల ధరించిన దీక్షదారులు స్వామివారికి ఇరుముడిని సమర్పించారు. పంచామృతాభిషేకం, మహాసుదర్శనహోమం, పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలను నిర్వహించారు.



గోవింద మాలధారులు పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

కేశవస్వామి హుండీ ఆదాయం రూ.9.21లక్షలు

పురాన ప్రసిద్ధిగాంచిన ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హుండీ కానుకలు లెక్కింపు నిర్వహించారు. తనిఖీదారు ప్రసాద్ పర్యవేక్షణలో హుండీ కానుకలు లెక్కింపు నిర్వహించారు. 4 నెలల 21 రోజులకుగాను ప్రధాన హుండీల ద్వారా రూ.7,11,464, అన్నదాన హుండీల ద్వారా 2,09,837 వెరసి రూ.9,21,301 ఆదాయం లభించినట్లు ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి తెలిపారు. ఉమాకమండలేశ్వర స్వామి హుండీ కానుకలు 2 నెలల 11 రోజులకుగాను రూ.1,27,525 ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు.

అసంపూర్తిగా ఉన్న భవనాలు పూర్తి చేస్తాం

● కమిషనర్ ఆఫ్ స్కూల్ పీడీ ముప్వా రామలింగం



చెల్లూరులో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రామలింగం

రాయవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో సంస్కరణల్లో భాగంగా మనబడి-మనభవిష్యత్తు పథకంలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాలను త్వరలోనే పూర్తి చేస్తామని వీటికి ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయించనున్నట్లు కమిషనర్ ఆఫ్ స్కూల్(ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పీడీ ముప్వా రామలింగం తెలిపారు. బుధవారం రాయవరం మండలం పసలపూడి, చెల్లూరు గ్రామాల్లో టెన్త్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం సీబీఎస్ఈ, హైస్కూల్ ప్లస్ పాఠశాలలను విరమించుకునే ఆలోచన ఉన్న నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్సరం నాటికి అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. మనబడి- మనభవిష్యత్తు పథకంలో తాగునీరు, విద్యుద్దీకరణ, కిచెన్, షెడ్లు, టాయిలెట్స్, మేజర్, మైనర్ రిపేర్లు, గ్రీన్‌చాక్ బోర్డు, పెయింటింగ్ తదితర పనులను విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా పూర్తిచేస్తామన్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామని సిమెంట్ అవసరమైన పాఠశాలలకు సిమెంట్ అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పిల్లి రాంబాబు ఉన్నారు.

జిల్లాలో ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని టెన్త్ పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు ముప్వా రామలింగం తెలిపారు. బుధవారం రాయవరం మండలం చెల్లూరు, పసలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 110 పరీక్షా కేంద్రాల్లో 19వేల 217 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. విద్యార్థులు పరీక్షలు రాసే క్రమంలో ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని, విద్యార్థులకు అవసరమైన మౌళిక సదుపాయాలైన తాగునీరు, టా యిలెట్స్‌తోపాటు పరీక్షా కేంద్రాల గదుల్లో తగినంత వెలుతురు ఉండే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు.

రామచంద్రపురంలో పరీక్షా కేంద్రాల తనిఖీ

రామచంద్రపురం(ద్రాక్షారామ): పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు పరీక్షల ప్రత్యేకాధికారి, ఇన్‌ఫ్రా డైరెక్టరు ముప్వారామలింగం తెలిపారు. బుధవారం రామచంద్రపురం పట్టణంలో పదో తరగతి 6 పరీక్షా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరు పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు, తాగునీరు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారా లేదా అని పరిశీలించారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాని డీవైఈవో పి.లక్ష్మణమూర్తి, మండల విద్యాశాఖాధికారులు తాడి వీర్రాఘవరెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరరావులను ఆదే శించారు. ఆయన వెంట సమగ్రశిక్షాభియాన్ ఏఎంవో పిల్లి రాంబాబు ఉన్నారు. అనంతరం రామచంద్రపురం మండలం హసన్‌బాద జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు నేడు పనులను పరిశీలించారు.

కె.గంగవరం: మండలంలో పదో తరగతి పరీక్షలు జరుగుతున్న కోటిపల్లి, పామర్రు ఉన్నత పాఠశాలలను పది పరీక్షల ప్రత్యేక పరిశీలకుడు ముప్వ రామలింగం బుధవారం పరిశీలించారు. అక్కడ విద్యార్థులకు చేసిన ఏర్పాట్లను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సమగ్ర శిక్షా ఏఎంవో పిల్లి రాంబాబు ఉన్నారు. బుధవారం పదో తరగతి పరీక్షను కోటిపల్లిసెంటర్‌లో 70మంది, దంగేరుసెంటర్‌లో 133 మంది, కె.గంగవరం సెంటర్‌లో 85మంది, పామర్రు సెంటర్‌లో 165 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

యంత్ర పరికరాలతో పూతరేకుల తయారీ

ఆత్రేయపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): నూతన టెక్నాలజీ పద్ధతిలో పూతరేకులను తయారు చేసుకుని విధానంపై ఫుడ్ ప్రాసెస్సింగ్ సొసైటీ, వెలుగు ఆధ్వర్యంలో బుధవారం ఆత్రేయపురం రావిచెట్టు సెంటర్లో మహిళలకు అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ మిషన్ ద్వారా ఎటువంటి పొల్యూషన్ లేకుండా రేకులను తయారు చేసుకోవచ్చునని సంస్థ ఇన్‌చార్జ్ మారుతి పేర్కొన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈ యూనిట్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. యూనిట్ విలువ రూ.లక్ష కాగా 35 శాతం రాయితీపై బ్యాంకు రుణ సదుపాయంతో యూనిట్ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం గంగాధర్, సౌమ్య, ఈశ్వర్, బుద్ధరాజు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఆత్రేయపురంలో మహిళా సంఘాలకు పూతరేకుల తయారీపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

నెలాఖరుకి స్వామిత్ర సర్వేను పూర్తిచేయాలి

● డీపీవో శాంతలక్ష్మి

కె.గంగవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరుకి మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న స్వామిత్ర సర్వేను పూర్తిచేయాలని డీపీవో డి.శాంతలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె మండలంలోని కోటిపల్లి, కూళ్ల, పామర్రు గ్రామాల్లో పర్యటించారు. కూళ్ల గ్రామంలో జరుగుతున్న స్వామిత్ర సర్వేను పరిశీలించారు. సర్వే చేస్తున్న సిబ్బందితో మాట్లాడారు. కొన్ని సూచనలు చేశారు. తరువాత చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. తడి, పొడిచెత్త వేరు చేసి నిలువచేసే విధానం చూశారు. గ్రామంలో తడిచెత్త, పొడిచెత్త విడిగా సేకరిస్తున్న విధానం గురించి సర్పంచ్ చిల్లి నాగేశ్వరరావు డీపీవో శాంతలక్ష్మికి వివరించారు. తడిచెత్త, పొడిచెత్త విషయంలో ప్రజలకు అవగాహన కలిగించాలని, నేడిప్ కిట్లు సమకూర్చుకోవాలని కార్యదర్శి ముద్రగడ సత్యనారాయణ (చంటి)కి డీపీవో సూచించారు. కోటిపల్లి, పామర్రు గ్రామాల్లోను చెత్తనుంచి సంపద ఉత్పత్తి కేంద్రాలను ఆమె పరిశీలించారు. చెత్త సేకరణ విధానం ఆరా తీశారు. శానిటేషన్ సిబ్బంది, ట్రైసైకిల్స్ గురించి కార్యదర్శులు సుబ్బారావు, సీతారామయ్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఈవోపీఆర్డీ గైరీకుమారి, కార్యదర్శులు సత్యనారాయణ, గౌరీశంకర్, ఆయా పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



కూళ్లలోని చెత్తనుంచి సంపద ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శాంతలక్ష్మి



ఊబలంక ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

ఇసుక ర్యాంపుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

● కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ హెచ్చరిక

రావులపాలెం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానాలను అతిక్రమించి ఎవ్వరైనా ఇసుక ర్యాంపుల్లో అక్రమలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ హెచ్చరించారు. రావులపాలెం మండలంలోని ఊబలంక, పొడగట్లపల్లి ఇసుక ర్యాంపులను ఆయన టాస్క్‌ఫోర్స్ బృందంతో కలిసి పరిశీలించారు. ఇసుక ర్యాంపు, స్టాక్ పాయింట్, రికార్డులను పరిశీలించి అక్కడ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించి ఎవ్వరైనా అక్రమ ఇసుక తవ్వకాలు జరిపితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఇసుకలోడు లారీలు, ఇసుక ఎగిరి వాహనాదారులపై పడకుండా పైన బరకాలు కప్పి రవాణా చేయాలన్నారు. అదేవిధంగా వేగంగా నడిపే వాహనదారులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక ర్యాంపుల్లో గనులశాఖ అధికారులు సూచించిన ప్రాంతాల్లో మాత్రమే ఇసుక తవ్వకాలు జరపాలన్నారు. ఆర్డీవో వెంట తహశీల్దారు ముక్తేశ్వరరావు, ఎంపీడీవో మహే ష్, ఆర్ఐ సుజాత, ఆర్డీవో అధికారులు ఉన్నారు.

జామియా మసీదు అభివృద్ధికి రూ.లక్ష విరాళం



రూ.లక్ష విరాళం అందిస్తున్న రెహ్మాన్

కొత్తపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కొత్తపేట కమ్మిరెడ్డిపాలెంలో ఉన్న జామియా మసీదుకు హైదరాబాద్ నివాసి ఎండీ మహబుబ్‌రెహ్మాన్, అతని సోదరి పేరుమీద మసీదు అభివృద్ధికి రూ.లక్ష విరాళాన్ని ముస్లిం సంఘ నాయకులు షేక్ ఖ్వాజాబాబుకు అందించారు. కొత్తపేటకు చెందిన రెహ్మాన్ ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. ఆయన తల్లి మహబూబ్ ఉన్నీషా శత జయంతిని పురస్కరించుకుని మసీదు అభివృద్ధికి రూ.లక్ష అందించారు. ఆయనను ముస్లిం నాయకులు కృతజ్ఞతలు తెలిపి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం నాయకులు షేక్ గౌస్, ఇంతియాజ్ అహ్మద్, బిలాల్, షేక్ ఫరీద్, షేక్ బాబు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సౌకర్యాల కల్పనకు కృషి

కొత్తపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని కొత్తపేట ఎంపీడీవో పి.నరేష్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక భవిత కేంద్రంలో పారా సంస్థ కోఆర్డినేటర్ బడుగు మహిమరావు ఆధ్వర్యంలో కేర్ గివెర్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీవో నరేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక ప్రతిభావంతుల కోసం ఫిజియోథెరపీ సేవలను అందిస్తుందని తల్లిదండ్రులు ఈ సేవలను వినియోగించుకుని తమ పిల్లలు రోజువారి కార్యక్రమాలు వారంతట వారే చేసుకునేలా పిల్లలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం పారా అడ్మినిస్ట్రేటర్ జి.సింహరాయులు ప్రతిభావంతుల పిల్లలకు టీఎల్ఎన్ కిట్లతో పాటు తులసీధర్ విద్యార్థికి వీల్‌చైర్‌ను అందించారు. కార్యక్రమంలో పారా సంస్థ సభ్యులు బడుగు సుబ్బాయమ్మ, ఎంవీవీ సత్యనారాయణ, డాక్టర్ ఎస్.సంగీత, వెంకటేశ్వరరావు, ఐశయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నరేష్‌కుమార్

చురుగ్గా సీసీ రోడ్డు పనులు

కె.గంగవరం, మార్చి19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాణింగపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గ్రామంలో ప్రధాన రహదారి నుంచి వ్యవసాయ పొలాలకు వెళ్లేదారి, పంచాయతీ చెరువచుట్టూ రహదారి అధ్వానంగా తయారైంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రహదారిని అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం వహించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామంలో మన గ్రామం మన సుభాష్ కార్యక్రమం నిర్వహించిన సందర్భంలో కూటమి నాయకులు రహదారి దుస్థితిని మంత్రి సుభాష్‌కు వివరించారు. దీంతో గణపతి ఆలయం నుంచి దుర్గామాత ఆలయం వరకూ పంచాయతీ చెరువుచుట్టూ సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. రూ.35లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులు వేగంగా జరుగుతున్నాయి. నాయకులు కొత్తపల్లి మొరార్జీ, బలుసు నాగేంద్ర, గొడవర్తి రాంబాబు, మేకా రాధాకృష్ణ, అల్లూరి కృష్ణయ్య, బలుసు ప్రసాద్, కానిమిల్లి శ్రీనివాసు, అల్లూరి సత్యనారాయణ, కమ్మ రాంబాబు పర్యవేక్షించారు ప్రభుత్వం సహకరించి నిధులు మంజూరు చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

సునీత విలియమ్స్‌కు స్వాగతం పలికిన విద్యార్థులు



కె.గంగవరం ఉన్నత పాఠశాలలో సునీత విలియమ్స్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు, ఉ పాధ్యాయులు

కె.గంగవరం, మార్చి19(ఆంధ్రజ్యోతి): 9నెల ల తరువాత అంతరిక్ష్యం నుంచి క్షేమంగా తిరిగి వచ్చిన సునీత విలియమ్స్‌కు కె.గంగవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పీవీ బ్రహ్మానందం సునీత విలియమ్స్ జీవిత విశేషాలను విద్యా ర్థులకు వివరించారు. అంతరిక్షంపై అవగాహన కలిగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇస్రో సంస్థ పరీక్ష నిర్వహిస్తుంది. దానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే అంతరిక్షం గురించి ప్రత్యేక శిక్షణ ఇస్తారని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరావు, ఉపాధ్యాయులు శ్రీధర్, రామలక్ష్మి, పి.శ్రీనివాస్, కె.శ్రీనివాస్, జి.ఏడుకొండలు, నండూరి భీమరాజులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ

కె.గంగవరం, మార్చి19(ఆంధ్రజ్యోతి): వేసవికాలం మండుతున్న ఎండలతో అల్లాడుతున్న విద్యార్థులకు ఉపసమనం కలిగించాలని పాణింగపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేడిశెట్టి పుల్లయ్య ఆలోచించారు. గ్రామస్తులను సహకరించాలని కోరారు. పాఠశాల పనిచేసే ప్రతీరోజు రెండులీటర్ల పెరుగు అందించాలని కోరారు. దాంతో విద్యార్థులకు మజ్జిగ అందజేస్తున్నారు. ఇప్పటివరకూ బలుసు నాగేంద్ర, పెందుర్తి కుమార్, కొరిపెల్ల రవితేజ, కొత్తపల్లి మొరార్జీ, సర్పంచ్ చీకట్ల సునీతగోపాలం విద్యార్థులకు పెరుగు పంపించారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌లకు విద్యార్థుల ఎంపిక

రావులపాలెం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల నిర్వహించి న ఏఐసీఐ బ్యాంకు కోచింగ్ కాంపిటేషన్ అకాడమీ నిర్వహించిన మెరిట్ స్కాలర్‌షిప్ పోటీలలో డిగ్రీ కళాశాల విద్యార్థులు గెలుపొంది నగదును అందు కున్నారు. వైస్ ప్రిన్సిపాల్ రమేష్‌బాబు మాట్లాడుతూ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న వై.సూర్యవెంకటకృష్ణ, వి.లక్ష్మణస్వామి, వెంకన్నబాబులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు గెలుపొంది రూ.30వేలు, రూ.22వేలు, రూ.15వేలు చొప్పున నగదు బహుమతులు అందుకున్నట్లు ఆయన తెలిపారు. దీంతో విద్యార్థులను కళాశాలలో అభినందించారు. జేకేసీ కోఆర్డినేటర్ కె.రజనీ, ఎన్ఎస్ఎస్ అధికా రి ఎస్.అరుణ్‌కుమార్, అధ్యాపకులు సుభాషిణి, బీపీఎన్ రెడ్డి, సిద్ధార్థ, సుందర్‌రామిరెడ్డి పాల్గొన్నారు.



మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఉగాది కవితల పోటీలు

ఆలమూరు, మార్చి 19: ఆలమూరు మండలస్థాయిలో ఉగాది రోజున కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీఅంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకుడు అంగర గోపాలకృష్ణ తెలిపారు. విశ్వావసు-విశ్వాశాంతి అనే అంశంపై ఈ కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు పోటీలో పాల్గొని తొలి మూడుస్థానాలలో విజేతలైన కవులు, రచయితలకు ఉగాది రోజున సంధిపూడిలో జరిగే ఉగాది ఉత్సవాలలో సత్కరించనున్నట్లు తెలిపారు. కవులు తమ కవితలను ఈనెల 27వ తేదీలోపు 9963163 136 వాట్సాప్‌కు పంపించాలని కోరారు. పద్యం, గేయం, కవిత ఈ మూడు ప్రక్రియలలో తమ కవితలు పంపవచ్చునని ఏ ఫోర్‌సైజ్ తెల్లకాగితంపై స్పష్టంగా ఒకవైపు రాసి కవితలు పంపాలని ఒకరు ఒక కవిత మాత్రమే పంపించాలని గోపాలకృష్ణ కోరారు.

కుమారుడితో సహా తల్లి అదృశ్యంపై కేసు నమోదు

ద్రాక్షారామ,మార్చి19(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల కుమారుడితో సహా తల్లి అదృశ్యంపై ద్రాక్షారామ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దంగేరు శివారు కూనిమిల్లిపాడుకు చెందిన నీలశాంతికుమారి రామచంద్రపురం మండలం తోటపేటలో ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తుంది. తనతోపాటు నాలుగేళ్ల తన రెండవ కుమారుడు కుష్వంత్‌ఈశ్వర్‌ను పాఠశాలకు తీసుకువెళుతోంది. ఈనెల 17న ఉదయం 7 గంటలకు తన కుమారుడితో పాఠశాలకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి రాలేదు. దీంతో శాంతికుమారి మామగారు నీలరామకృష్ణ పాఠశాలకువెళ్లి అడుగ్గా మధ్యాహ్నం 2 గంటలకు బట్టలు కొనాలని పర్మిషన్ తీసుకుని కుమారుడితో వెళ్లిందని తెలిపారు. ఫోన్‌చేయగా స్విచ్‌ఆఫ్ వస్తోంది. చుట్టుపక్కల గాలించగా ఆచూకీ తెలియలేదు. తనకోడలు శాంతికుమారి(24), మనుమడు కుష్వంత్ ఈశ్వర్(4) ఆచూకీ తెలపాలని మామ నీలరామకృష్ణ ఫిర్యాదుమేరకు ఏఎస్ఐ భుజంగరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ దస్తావేజుల కేసులో మరొకరికి రిమాండ్

రాజోలు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నకిలీ దస్తావేజులు సృష్టించి ఒకరికి విక్రయించిన భూమిని వేరొకరికి అమ్మ చూపిన కేసులో రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన వల్లూరి అచ్చుకుమారి అలియాస్ దంగేటి అచ్చుకుమారిను అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించారని రాజోలు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే వెంటూరు గ్రామానికి చెందిన వల్లూరి రామసుబ్బరాయలు, రామచంద్రపురం మండలం నర్సాపురపుపేటకు చెందిన పిల్లి సూర్యనారాయణను అరెస్టు చేశామన్నారు. ఈ కేసులో మరికొంతమంది నిందితులు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్ఐ రాజేష్‌కుమార్ తెలిపారు.

'22లోగా ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి'

కపిలేశ్వరపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుద్యోగ యువత ఉపాధి రుణాలకు ఈనెల 22వ తేదీలోగా మీసేవ కేంద్రాలు, గ్రామసచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కె.రత్నకుమారి బుధవారం తెలిపారు. బీసీ కులాలతోపాటు, ఆర్థికంగా వెనుకబడిన ఆర్య, వైశ్య, రెడ్డి, కమ్మ, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు, కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు బ్యాంకు రుణాలు, రాయితీతో ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

30న రాష్ట్రస్థాయి ప్రతిభా పోటీలు

రాయవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని లొల్ల విశ్వమానవతా ఆశ్రమంలో ఈనెల 30న ఉగాది పురస్కరించుకుని రాష్ట్రస్థాయి ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్లు విశ్వమానవతా సంస్థ అధినేత అల్లూరి శ్రీనివాస చౌదరి తెలిపారు. బుధవారం మండలంలోని లొల్లలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వేమన పద్యాలు, భగవద్గీత శ్లోకాలు, అన్నమాచార్య కీర్తనలు, వ్యాసరచన, యోగా, వక్తృత్వ పోటీలు, సాంస్కృతిక పోటీలు, కవితలు, శ్రీశ్రీ సంఘ సంస్కరణ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 8:00 నుంచి మధ్యాహ్నం 11:30 వరకు పోటీలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 3గంటల నుంచి 6గంటల వరకు సంస్కార విద్య పుస్తకావిష్కరణ, ధ్యాన మందిరం ప్రారంభోత్సవం, ప్రకృతి వ్యవసాయం, వివిధ రంగాల్లో సేవలందించిన వారికి పురస్కారాలు అందజేత తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వివరాల కోసం ఫోన్ 9966673111 లేదా ఇన్‌ఫో ఎట్‌దిరేట్ మానవతా ఓఆర్‌జీకి సంప్రదించాలన్నారు.

రేపు ప్రపంచ కవితా దినోత్సవం

మండపేట, మార్చి19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఈనెల21న శుక్రవారం సాయంత్రం స్థానిక అన్నపూర్ణ హైస్కూల్‌లో కవితల పోటీలను నిర్వహిస్తున్నామని అభ్యుదయ రచయితల సంఘం డాక్టర్‌బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాశాఖ అధ్యక్షుడు డాక్టర్ చల్లా రవికుమార్ చెప్పారు. మరిన్ని వివరాలకు కవి రచయిత గండి ప్రసాద్ ఫోన్ నెం.9949284754 సంప్రదించాలని కోరారు.

కల్యాణ మండపంలో విద్యుత్ చౌర్యం

ఆత్రేయపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): అన్ని హంగులతో నిర్మించిన ఓ కల్యాణ మండపంలో నిర్వాహకులు విద్యుత్ చౌర్యానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రం ఆత్రేయపురంలోని ఓ కల్యాణ మండపంలో తరుచూ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. రెండురోజుల క్రితం విద్యుత్‌శాఖకు చెందిన విజిలెన్స్ బృందం ఆ కల్యాణ మండపంపై దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లుగా అధికారులు గుర్తించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సమాచారంపై ఉన్నతాధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. సుమారు రూ.5 లక్షల నుంచి రూ.8లక్షల వరకు అపరాధ రుసుం విధించినట్లు సమాచారం. ఈ విషయంపై విద్యుత్‌శాఖ అధికారులను ఆరా తీయగా దాడులు చేసిన మాట వాస్తవమే. మిగిలిన సమాచారంపై స్పష్టత ఇవ్వలేదు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

రాయవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి శివారు ప్రాంతంలో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. బుధవారం రాత్రి ఎస్ఐ మాట్లాడుతూ గ్రామ శివారు ప్రాంతంలో పోలీసులు దాడిచేసి ఐదుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 6,900 రూపాయలు నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'ఆటోల రికార్డులు సక్రమంగా ఉండాలి'

ఆలమూరు, మార్చి19(ఆంధ్రజ్యోతి): ఆటోల రికార్డులు సక్రమంగా ఉండే విధంగా డ్రైవర్లు శ్రద్ధ వహించాలని రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ సూచించారు. ఆలమూరు మండలం కొత్తూరు సెంటర్లో సీఐ విద్యాసాగర్ ఆటో డ్రైవర్లతో చర్చించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆటో సిబుక్, ఇన్సూరెన్సు, డ్రైవింగ్ లైసెన్సులు ప్రతీఒక్కరూ సక్రమంగా ఉంచుకోవాలని లేని పక్షంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని చెప్పారు. రికార్డులు సక్రమంగా లేకపోతే కేసులు నమోదు చేయాల్సి వస్తోందని డ్రైవర్లు ముందుగా జాగ్రత్తలతో రికార్డులు సక్రమంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

చుండ్రు కుటుంబానికి పలువురి పరామర్శ

మండపేట, మార్చి19(ఆంధ్రజ్యోతి): భార్య వియోగంతో బాధపడుతున్న రాష్ట్ర ఒలింపియాడ్ చైర్మన్ చుండ్రు గోవిందరాజు, ఆయన తనయుడు మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్‌లను బుధవారం పలువురు ప్రముఖులు మండపేటలో పరామర్శించారు. వారిలో కాకినాడ ఎస్ఆర్ఎంటీ అధినేత కంటిపూడి పార్థసారధి, మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర, రాయవరం బాబు, ఏడిద గ్రామసర్పంచ్ బూరిగ ఆశీర్వాదం,తదితరులు పరామర్శించారు.



అనంతలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్ఆర్ఎంటీ సంస్థల అధినేత కంటిపూడి పార్థసారధి